అందరూ వినండహో..!

దండోరా మాయమైపోయింది

(వివరాలు 4వ పేజీలో...)

రేపు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఈ నెల 25వ తేదీ కలెక్టరేట్‌లో నిర్వహిస్తామని కలెక్టర్ వినోద్‌కుమార్ శనివారం తెలిపారు. ప్రజలు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో సోమవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని తెలిపారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీకి సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు.

గురుతరం

మార్కులతో డీఎస్సీ ఫలితాలు విడుదల

- అర్హులైన అభ్యర్థుల ఫోన్‌లకు మెసేజ్‌లు
- ఉమ్మడి జిల్లాలో భర్తీ కానున్న 807 టీచర్ పోస్టులు

అనంతపురం విద్య, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ మెరిట్ లిస్టు వచ్చేసింది. రాష్ట్ర విద్యాశాఖ శుక్రవారం రాత్రి అధికారికంగా విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 807టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఇందులో ఎస్జీటీ పోస్టులు 147, ఎస్జీటీ కన్నడ 07, ఎస్జీటీ ఉర్దూ 48 పోస్టులు ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్లలో తెలుగు 28, ఉర్దూ 9, హిందీ 28, ఇంగ్లీష్ 103, గణితం 43, ఫిజికల్ సైన్స్ 66, బయాలజికల్ సైన్స్ 72, సోషియల్ 110, సోషియల్ ఉర్దూ 1, ఫిజికల్ డైరెక్టర్లు(పీడీ)145 ఉన్నాయి. ఈ పోస్టులకు 45,186 మంది పరీక్షలు రాశారు. ప్రస్తుతం డీఎస్సీ మెరిట్ లిస్టు విడుదల చేయడంతో ఎవరు ఏ సబ్జెక్టులో టాపరో, ఎన్ని మార్కులు వచ్చాయో తెలిసి పోయింది. అలాగే అభ్యర్థులు కటాఫ్ ఎంతకు ఉంటుందనే విషయంలో లెక్కలు వేసుకుంటున్నారు.

రేపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

మెరిట్, రోస్టర్ ఆధారంగా టీచర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ఫోన్‌లకు రాష్ట్ర విద్యాశాఖ

(మిగతా 4వ పేజీలో....)

అమరేష్.. అదుర్స్..!



అమరేష్‌కు స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు

కష్టే ఫలి అనే నానుడికి జిల్లా టాప్ ర్యాంకర్ అమరేష్ నిదర్శనంగా నిలిచారు. తొలిసారి ఉద్యోగం రాలేదని కుంగిపోకుండా మరింత కసితో చదివారు. ఈ క్రమంలో డీఎస్సీ-2025లో 88.89 మార్కులు సాధించి, సోషియల్ అసిస్టెంట్ విభాగంలో జిల్లా టాపర్‌గా నిలిచారు. ఆత్మకూరు మండలం తలుపూరుకు చెందిన నారాయణ, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు పలమాసి అమరేష్ 2018లో జరిగిన డీఎస్సీలో ఎస్జీటీ పోస్టుకు పరీక్షలు రాశారు. అప్పుడు ఎంపిక కాలేకపోయారు. అయినా నిరాశ చెందలేదు. మరింత కసితో కోచింగ్ సెంటర్‌కు వెళ్లి శిక్షణ పొంది, పరీక్షలకు సిద్ధమై విజయం సాధించారు. జిల్లా టాపర్‌గా, రాష్ట్రస్థాయిలో నాలుగో ర్యాంకర్‌గా అమరేష్ నిలవడంతో ఆయన కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది.

అయ్యో.. వెంకటీ..!

అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున నిల్వ ఉంచిన విత్తనాలు, మందులు

యాడికిలో వెంకట్ ఫర్టిలైజర్స్ గోడౌన్ సీజ్

విత్తనాలు, పురుగు మందుల విలువ రూ.1.10కోట్లు

జిల్లాలోని ఎరువుల గోదాముల్లో అధికారుల తనిఖీలు



అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున నిల్వ ఉంచిన విత్తనాలు, మందులు

యాడికి/అనంతపురం అర్బన్ ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో వెంకట్ ఫర్టిలైజర్స్‌కు సంబంధించిన గోడౌన్‌పై వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా విక్రయ అనుమతులు లేని రూ.1.10కోట్ల విలువ జేసే పత్తి, మొక్కజొన్న విత్తనాలు, పురుగు మందులను సీజ్ చేశారు. ఏఓ మహబూబ్‌బాషా తెలిపిన మేరకు వెంకట్ ఫర్టిలైజర్స్ గోడౌన్‌లో విక్రయ అనుమతి లేని రూ.90లక్షలు విలువజేసే పత్తి, మొక్కజొన్న విత్తనాలను గుర్తించినట్లు తెలిపారు. అనుమతి లేని గోడౌన్‌లో నిల్వ ఉంచిన రూ.20లక్షలు విలువజేసే పురుగుల మందులను గుర్తించినట్లు తెలిపారు. సంబంధిత దుకాణదారుడికి విత్తన విక్రయాలకు సంబంధించి జూన్ నెలలోనే గడువు ముగిసినట్లు తెలిపారు. విత్తనాలు, పురుగుల మందులను ఒకే గోడౌన్‌లో నిల్వ ఉంచడం వలన విత్తనాల జర్మినేషన్ శాతం పూర్తిగా తగ్గిపోతుందన్నారు. లైసెన్స్ లేకుండా విత్తనాలు విక్రయించడం, అనుమతిలేని గోడౌన్‌లో నిల్వ ఉంచడం చట్ట విరుద్ధమని తెలిపారు. తనిఖీల్లో వీఆర్ఓ దామోదర్ నాయుడు, వీఏఏ రమేష్, ఎంపీఈఓ రమేష్‌లు పాల్గొన్నారు.

మూడు గోదాముల్లో

జిల్లాలోని మూడు ఎరువుల గోదాముల్లో విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు శనివారం తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ జిల్లా ఎస్పీ వైబీపీటీఏ ప్రసాద్, డీఎస్పీ నాగభూషణం తమ సిబ్బంది, వ్యవసాయ అధికారులతో కలిసి అనంతపురం నగర శివారు తపోవనంలోని సిరి గుప్త గోదాము, గుత్తి రోడ్డులోని సుబ్రహ్మణ్యేశ్వర గోదాము, రాప్తాడు మండలం అయ్యవారిపల్లి వద్ద అవేజ్ గోదాములను తనిఖీ చేశారు. అవేజ్ గోదాములో ఏపీ మార్క్‌ఫెడ్‌కు సంబంధించిన 1600 మెట్రిక్ టన్నుల యూరియాను (మిగతా 4వ పేజీలో...)

గడువులోగా గేట్ల ఏర్పాటు : కాలవ



తయారవుతున్న గేట్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గం, ఆగస్టు 23(ఆంధ్ర జ్యోతి): తుంగభద్ర ప్రాజెక్టుకు కొత్తగేట్ల ఏర్పాటు గడువులోగా పూర్తి కావాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు టీబీ బోర్డు అధికారులను కోరారు. తుంగభద్ర ప్రాజెక్ట్ గేట్ల భద్రతపై రైతుల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో శనివారం ఆయన టీబీ ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం బోర్డు అధికారులతో మాట్లాడారు. భారీ వరద కారణంగా తుంగభద్ర ప్రాజెక్టు 19వ గేట్ గత ఏడాది నదిలో కొట్టుకుపోయిన విషయం విదితమే. సీడబ్ల్యూసీ నిపుణుల బృందం సిఫార్సుల మేరకు పాత గేట్ల స్థానంలో కొత్తవాటిని అమర్చేందుకు ఆంధ్ర, కర్ణాటక ప్రభుత్వాలు అంగీకరించాయి దీంతో కొత్త గేట్ల ఏర్పాటు పనులను గుజరాత్‌కు చెందిన ఓ కంపెనీకి తుంగభద్ర బోర్డు అప్పగించింది. డ్యాంలో 33 గేట్లు అమర్చాల్సి ఉండగా ఇప్పటివరకు ఆరు గేట్లను తయారు చేశారు. జూన్ 2026 గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను కాలవ ఆదేశించారు.

టంగుటూరి జీవితం స్ఫూర్తిదాయకం

- జేసీ శివనారాయణ శర్మ



నివాళులు అర్పిస్తున్న జేసీ, అధికారులు

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రకాశం పంతులు చూపిన తెగువ, ధైర్యం నిరుపమానం అన్నారు. సైమన్ గో బ్యాక్ అంటూ బ్రిటీష్ వారి తుపాకి గుండ్లకు ఎదురొడ్డి నిలిచి ఆంధ్రకేసరిగా పేరు గడించారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, డీఎస్పీ శ్రీనివాసరావు, అష్రఫ్‌అలీ, డీఈఓ ప్రసాద్‌బాబు, డీపీఆర్ఓ బాలకొండయ్య, పర్యాటక శాఖ అధికారి జయకుమార్, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, సిబ్బంది పాల్గొన్నారు.

మరణాలు సంభవిస్తే ఇంటికే..!

ఉద్యోగులు, సిబ్బందికి డీఎంహెచ్ఓ వార్నింగ్



కురుగుంట వైద్యకేంద్రం డాక్టర్లు, సిబ్బందిని ప్రశ్నిస్తున్న డీఎంహెచ్ఓ

అనంతపురం వైద్యం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మాతా శిశు మరణాలు సంభవిస్తే బాధ్యులైన ఉద్యోగులు ఇంటికి వెళ్లాల్సి వస్తుందని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి డాక్టర్ ఈబీ దేవి హెచ్చరించారు. తన కార్యాలయంలో మతాశిశు మరణాలపై శనివారం సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా జూలైలో జరిగిన మాతాశిశు మరణాలపై బాధిత కుటుంబ సభ్యుల సమక్షంలోనే విచారించారు. డీసీహెచ్ఎస్ డేవిడ్ సెల్వం రాజు, డీఐఓ డాక్టర్ యుగంధర్, అనస్తీషియా విభాగాధిపాతి నవీన్ కుమార్, చిన్న పిల్లల వైద్యులు ప్రణీత్, గైనిక్ డాక్టర్ పద్మశ్రీ, డీపీహెచ్ఎన్ఓ ప్రమీలా దేవి, హేమలత, ఐసీడీఎస్ సీడీపీఓ అనూరాధ, అమా శంకరమ్మను, వైద్యులు, సిబ్బందిను ప్రశ్నించారు. మహిళలు గర్భందాల్చింది మొదలు ప్రసవం వరకు ఆరోగ్య పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత మనపై ఉందని డీఎంహెచ్ఓ అన్నారు. ఐసీడీఎస్ అధికారులు పౌష్టికాహార అంశంపై పర్యవేక్షించాలని అన్నారు. ప్రసవ ప్రక్రియను ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు చూడాలన్నారు. ప్రతిరోజు ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, హెల్త్‌వర్కర్లు పర్యవేక్షించాలని అన్నారు. అయినా మాతాశిశు మరణాలను అరికట్టలేకపోతే ఉద్యోగాలెందుకని ప్రశ్నించారు. ఒక్క జూలైలోనే ఆరుగు శిశువులు, ఇద్దరు మాతృమూర్తులు మృతిచెందడానికి కారకులెవరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ప్రాంత డాక్టర్లు, సిబ్బందికి మెమోలు జారీ చేస్తున్నామని తెలిపారు.

నిబంధనల మేరకే వెరిఫికేషన్

డీఎస్సీ కమిటీలతో డీఈఓ ప్రసాద్ బాబు

(4లో..)

శ్రావణం.. పరిసమాప్తం

(5లో..)

నియోజకవర్గానికో రైతు బజార్

(5లో..)

ఉచిత ఇసుకను సక్రమంగా అమలు చేయాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉచిత ఇసుక విధానం అమలును సజావుగా చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గనుల శాఖ పరిధిలో ఉచిత ఇసుక విధానం అమలుపై ఏజెన్సీలు, రవాణాదారులతో కలెక్టర్ శనివారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇసుక విధానంపై ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నట్లు తెలిపారు. సక్రమంగా ఇసుక ఆపరేషన్స్ చేయాలని, ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఇసుక లోకేషన్స్‌లో ఉన్న వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలు, మైన్స్ సిబ్బందితో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని, అన్ని వివరాలు తెలియజేయాలన్నారు. సమావేశంలో గనుల శాఖ ఇన్‌చార్జ్ ఏడీ ఆదినారాయణ, కణేకల్లు తహసీల్దార్ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంపై దృష్టి పెట్టాలి

ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన హౌసింగ్ శాఖ పరిధిలో హౌసింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డు అమెనిటీ సెక్రటరీలతో సమీక్షించి వివిధ సలహాలు సూచనలు అందజేశారు. సమావేశంలో హౌసింగ్ పీడీ శైలజ, డీఈ విజయభాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అనుచితంగా ప్రవర్తించి.. హతమయ్యాడు

ధనుంజయ హత్య కేసును ఛేదించిన పోలీసులు (5లో..)

అయ్యో.. వెంకటీ..!

(3వ పేజీ తరువాయి)

పరిశీలించారు. సిరిగుప్ప, సుబ్రహ్మణ్యేశ్వర గోదాముల్లో యూరియా స్టాక్ లేనట్లు గుర్తించారు. ఆయా గోదాముల నుంచి ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఎంత మోతాదులో యూరియా సరఫరా అయ్యింది..? తదితర అంశాలపై ఎస్పీ ఆరా తీశారు. అనంతపురం పాతూరులోని శ్రీనివాస ఫర్టిలైజర్స్ షాపులో రూ.17560లు విలువైన 22 లీటర్ల నిషేధిత గడ్డి మందును గుర్తించి, సీజ్ చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణం పరిగి రోడ్డులోని శ్రీ బాలాజీ ట్రేడర్స్‌లో 9.09 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు, రికార్డుల్లో వ్యత్యాసాన్ని గుర్తించి, తదుపరిచర్యలకు సిఫార్సు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ జమాల్ బాషా, విజిలెన్స్ ఏఓ వాసుప్రకాష్, ఎస్ఐ నరేంద్రభూపతి, డీసీటీఓ సురేష్‌కుమార్, హిందూపురం ఏడీఏ క్రిష్ణయ్య, అనంతపురం ఏఓ వెంకట్‌కుమార్, ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రూ.46.8 లక్షల మందులు సీజ్

అనుమతులు లేని క్రిమిసంహారక మందులను వ్యవసాయ అధికారులు శనివారం సీజ్ చేశారు. సమాచారం మేరకు అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్, అనంతపురం ఏఓ వెంకట్‌కుమార్ నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీ సంజీవరాయ ఫర్టిలైజర్స్‌లో తనిఖీలు చేపట్టారు. నాగపూర్‌లోని మహేష్ ట్రేడర్స్ నుంచి తెప్పించిన అనుమతులు లేని క్రిమిసంహారక మందులను గుర్తించారు. ఈ నేపథ్యంలో రూ.రూ.46.8 లక్షల విలువైన 117 బాక్సుల్లోని 2340 బాటిళ్లను (500 ఎంఎల్) సీజ్ చేశారు. అలాగే వన్‌టౌన్ పోలీసులకు వ్యవసాయ అధికారులు ఫిర్యాదు చేశారు.



అనంతపురంలోని ఎరువుల గోదాములో యూరియా సరఫరాపై వివరాలు ఆరా తీస్తున్న విజిలెన్స్ ఎస్పీ ప్రసాద్

అందరూ వినండహో..!

- ప్రజలకు సమాచారాన్ని చేరవేసిన తప్పెట
- సాంకేతిక విప్లవంతో కనుమరుగైన సంప్రదాయం

'గ్రామ పెజానికం యావన్మదికి తెలియజేయడమేమనగా.. రేపట్నుంచి మన ఊరి స్టోరులో బియ్యం, చక్కెర, కందిపప్పు, కిరసనాయిల్ వేస్తారంట. కావున రేషన్ కార్డులున్న వారంతా వచ్చి సరుకులు తీసుకెళ్లాలని మనూరి డీలర్... తెలియచేశాడహో'...!

'గ్రామ మహాజనులారా..! రేపు మనూరికి తాసీల్దారు సారు వారు వస్తున్నారు. ఎవరికైనా భూముల సమస్యలు, పట్టాపాసు బుక్కుల సమస్యలుంటే రేపొద్దున్న 10 గంటలకు పంచాయతీ ఆఫీసుకు వచ్చి అర్జీలు ఇచ్చుకోవాలని మనూరి వీఆర్వో చెప్పినాడండహో'.. అంటూ గతంలో పల్లెల్లో దండోరా(చాటింపు) వేసేవారు. అయితే మారిన కాలమాన పరిస్థితుల్లో దండోరా మాయమైంది.



దండోరా మాయమైపోయింది

ఆదివారం ప్రత్యేకం

బొమ్మనహాళ్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాల కిందట గ్రామంలో అందరికి సమాచారం తెలియాలంటే దండోరా వేయాల్సిందే. ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాలకు సంబంధించి దండోరా ద్వారానే గ్రామస్థులకు సమాచారం చేర వేసేవారు. గ్రామానికి అధికారులు వస్తున్నా, రేషన్ షాపులకు నిత్యవసరా సరుకులు వచ్చిన తుఫాన్, అంటు వ్యాధులు వంటి ప్రతికూల పరిస్థితులు ఏర్పడినా ఇంటి పన్నులు, భూమి శిస్తు, కరెంట్ బిల్లులు చెల్లించాల్సిన వచ్చినా, గ్రామంలో ఏవైనా సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న సందర్భంలోనైనా దండోరా ద్వారానే ప్రజలకు తెలిపేవారు. ఇందుకోసం ఓ వ్యక్తి ప్రత్యేకంగా ఉండేవాడు. అయితే పెరిగిన సాంకేతిక విప్లవంతో దండోరా వేయడం కాలగర్భంలో కలిసిపోయింది.


ఇంటిపేరే దండోరా..

గ్రామాల్లో దండోరా వేసేవాళ్లకు అదే ఇంటిపేరుగా మారిపోయింది. ఈ క్రమంలో వ్యక్తి పేరుకు ముందు దండోరాను తగిలించి గ్రామస్థులు పిలిచేవారు. ఒక వ్యక్తి తప్పెట కొడుతూ, ఊరంతా తిరుగుతూ, ప్రతి వీధిలో బిగ్గరగా, గంభీర వైన స్వరంతో సమాచారాన్ని వినిపించేవాడు. ఇలా చేయడంతో చదువురాని వారికి సైతం ఆ సమాచారం సులభంగా అర్థం అయ్యేది. ఇప్పటికి మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో దండోరా వినపడుతోంది. తప్పెట కొట్టి మైకు ద్వారా సమాచారం చేరవేస్తున్నారు. అయితే చాలా ప్రాంతాల్లో దండోరా వేయడం అంతరించిపోవడంతో వాటిపై ఆధారపడిన కుటుంబాలు కూడా ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల వైపు మళ్లాయి.

దండోరా వేస్తేనే అధికారిక సమాచారం

ఆ రోజుల్లో పల్లెల్లో ప్రభుత్వం పరంగా ఏ సమాచారం తెలియజేయాలన్నా దండోరా వేసేవారు. అలా చెప్తేనే మా అందరికి అధికారికంగా చెప్పినట్లు ఉండేది. తప్పెట ద్వారా దండోరా వేసే వ్యక్తులు రోడ్లపై వస్తే మేమంతా ఇంట్లో నుంచి బయటకు వచ్చి శ్రద్ధగా వినేవాళ్లం. ఇప్పుడు ఏమి వచ్చిందో తెలియడం లేదు. వాట్సాప్‌లో పంపించామంటారు.అదేంటో మాలాంటి వాళ్లకు తెలియదు.

\- లోకనాథ్‌రెడ్డి, శ్రీధరఘట్ట



అంతా ఫోన్లలోనే చూసుకుంటున్నాం

ప్రస్తుతం ఏ సమాచారమైనా సెల్‌ఫోన్‌లోనే చూసుకుంటున్నాం. ఎప్పటికప్పుడు సమాచారం వాట్సాప్‌లో వచ్చేస్తుంది. గ్రామ సమాచారం కూడా అందులోనే ఉంటుంది. దండోరా ద్వారా తెలుసుకుని వెళ్లేది చాలా తక్కువ. ఫోన్లో చూసుకున్న తర్వాత ఓహో ఇదేనా దండోరా వేసింది అనుకుంటూ ఉంటాం.

\- శివరాజ్, ఉప్పరహాళ్



ఇప్పటికి దండోరా కొట్టిస్తాం

గ్రామాల్లో ఏ సమాచారం ప్రజలకు తెలపాలన్న ముందుగా దండోరా వేయిస్తాం. ప్రజలకు తెలిసేలా వీధి వీధినా దండోరా వేయిస్తూ ప్రభుత్వ సమాచారం తెలుపుతున్నాం పై అధికారులు కూడా గ్రామాల్లో చాటింపు వేయించారా అని అడుగుతారు. వీఆర్ఏలు ముందుండి దండోరా వేసి అది వీడియో తీసి గ్రామ వాట్సాప్ గ్రూపులో పంపిస్తున్నారు.

\- శివన్న, పంచాయతీ కార్యదర్శి ఉద్దేహాళ్





40 ఏళ్ల నుంచి దండోరా వేస్తున్నా

దాదాపు 40 ఏళ్ల నుంచి నేనే గ్రామంలో దండోరా వేస్తున్నా. దండోరా వేయిస్తే ఊర్లో రైతులు ఒక్కసారికి రూ. 100 ఇస్తున్నారు. వీఆర్వో, పంచాయతీ సెక్రటరీ చెప్పిందే దండోరా వేస్తున్నా. ప్రభుత్వం నుంచి వచ్చిన ఏ సమాచారమైనా ఇప్పటికీ గ్రామంలో నేనే తప్పెట కొట్టి చెబుతున్నా. అయితే నాకు ఎలాంటి గవర్నమెంట్ జీతం ఇవ్వడం లేదు. నెల నెలా వృద్ధాప్య పింఛన్ మాత్రం రూ.నాలుగు వేలు ఇస్తున్నారు. ప్రభుత్వం గుర్తించి నెలకు ఎంతో కొంత వేతనం ఇవ్వాలి.

\- హనుమంతప్ప, ఉద్దేహాళ్ గ్రామం

గురుతరం

(3వ పేజీ తరువాయి)

సమాచారం పంపింది. ఈ సమాచారం వచ్చిన అభ్యర్థులందరికీ సోమవారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టనున్నారు. ఇందుకు జిల్లా విద్యాశాఖ నగరంలోని ఆలమూరు రోడ్డు నందు గల పీవీకేకే ఎంబీఏ కళాశాలలో ఏర్పాట్లు చేసింది. సర్టిఫికెట్ల పరిశీలనకు 16 బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ముగ్గురు సభ్యులు ఉంటారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు వచ్చే అభ్యర్థులు, వారివెంట వచ్చే పేరెంట్స్ కోసం 32 గదుల్లో వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

నిరుపేదను వరించిన టీచర్ పోస్టు



రొద్దం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొప్పాల గ్రామానికి చెందిన నిరుపేద మాల సోమశేఖర్‌ను టీచర్ పోస్టు వరించింది. పి.రొప్పాల గ్రామానికి చెందిన గౌరమ్మ, లక్ష్మణ్ణ దంపతుల నాలుగో కుమారుడు సోమశేఖర్ కూలి పని చేసుకుంటూ టీచర్ పోస్టు సాధించాడు. 20ఏళ్ల కిందటే తండ్రి చనిపోగా తల్లి గౌరమ్మ కూలి పని చేసుకుంటూ పిల్లలకు చదువు చెప్పించింది. సోమశేఖర్ సైతం తల్లికి చేదోడు వాదోడుగా ఉంటూ కూలి పనులకు వెళ్తూ చదువుకున్నాడు. దానికి ఫలితంగా శుక్రవారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్‌లో 73.97మార్కులతో 70వ ర్యాంక్‌తో సాధించాడు. తల్లి 20ఏళ్ల కృషి ఫలించడంతో వారి ఆనందానికి వదులు లేకుండా పోయాయి.

ఇట్టే సత్తా చాటిన మోహన్‌బాబు

శింగనమల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ- 2025 స్కూల్ అసిస్టెంట్ సోషియల్ విభాగంలో సోదనపల్లికి చెందిన అట్టే మోహన్ బాబు సత్తా చాటి జిల్లా స్థాయిలో 50 ర్యాంకు సాధించాడు. గ్రామానికి చెందిన వీరానారప్ప రెండో కుమారుడు అట్టే మోహన్‌బాబు మెగా డీఎస్సీ- 2025లో జిల్లా స్థాయిలో 76.52 మార్కులతో 50 ర్యాంకు సాధించాడు. దీంతో ఆయన కుటుంబంలో హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి.



కూలీల బిడ్డకు పీఈటీ పోస్టు



ఉరవకొండ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆమిద్యాల గ్రామానికి చెందిన మౌనిక ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్(పీఈటీ) పోస్టుకు ఎంపికయ్యారు. మెగా డీఎస్సీ- 2025లో జోనల్ స్థాయిలో 84 మార్కులు సాధించారు. దీంతో ఆమెకు జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు దక్కింది. వ్యవసాయ కూలీలైన మౌనిక తల్లిదండ్రులు తమ కుమార్తె విజయాన్ని చూసి ఉప్పొంగిపోయారు.

నిరుపేదకు 12వ ర్యాంకు



గుడిబండ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీఎన్ పాళ్యం గ్రామానికి చెందిన వెంకటేశ్, పద్మావతి దంపతుల కుమారుడు చంద్రశేఖర్ డీఎస్సీ-2025లో సోషియల్ సబ్జెక్టులో 12వ ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు ఎంపికయ్యాడు. నిరుపేద కుటుంబంలో జన్మించిన చంద్రశేఖర్ చక్కగా చదువుకుని ఉద్యోగం సాధించడంతో గ్రామస్థులు అతడిని అభినందించారు.

డబుల్ ధమాకా..!

ఓబుళదేవరచెరువు, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన లక్కోరి రమేష్ డీఎస్సీ-2025లో రెండు పోస్టులు సాధించాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన రమేష్ పీజీటీ జువాలజీ సబ్జెక్టులో జోన్-4లో 71.5 మార్కులతో రెండో ర్యాంకు సాధించాడు. అలాగే బయాలజీ స్కూల్ అసిస్టెంట్‌లో 80.03 మార్కులతో జిల్లాలో 22వ ర్యాంక్‌లో నిలిచారు.



సడలని దీక్షతో ఉద్యోగాలు

కళ్యాణదుర్గం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అరమార్కుతో కోల్పోయిన ఉద్యోగ అవకాశం ఆమెలో మరింత పట్టుదలను పెంచింది. మొక్కవోని దీక్షతో శ్రమిస్తూ డీఎస్సీ-2025లో రెండు ఉద్యోగాలు సాధించింది. ఆమే కళ్యాణదుర్గానికి చెందిన కామర్తి నవీన. డీఎస్సీ-2018లో అరమార్కు తేడాతో ఈమె ఎస్జీటీ ఉద్యోగాన్ని కోల్పోయింది. అయితే కుంగిపోకుండా తల్లి దండ్రుల ప్రోత్సాహంతో మరింత పట్టుదలగా చదివింది. పాఠ్యపుస్తకాలు, విద్యా సంబంధిత మ్యాగజైన్లలోని సమాచారాన్ని బాగా ఒంటబట్టించుకుని, ప్రతి రోజూ ప్రాక్టీస్ పేపర్లు రాసింది. ఈ నేపథ్యంలో 2025లో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైంది. అలాగే డీఎస్సీలో 75.06 మార్కులతో 68వ ర్యాంకు సాధించి సోషియల్ స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికైంది. అలాగే టీజీటీ సోషియల్ సబ్జెక్టులో రాయలసీమ జోన్ 70.42 మార్కులతో 89వ ర్యాంకుతో ఉద్యోగం సాధించింది. ఒకేసారి రెండు టీచర్ పోస్టులకు ఎంపికవడంతో తల్లిదండ్రులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన కామర్తి నవీన

కొత్తచెరువుకు కొలువుల పంట

కొత్తచెరువు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన టి.మాధవి డీఎస్సీ-2025 ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 86.48 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. స్కూల్ అసిస్టెంట్ గణితంలో కొత్తచెరువుకు చెందిన పి.కిరణ్‌కుమార్ 80.6 మార్కులతో 13వర్యాంకుతో ప్రభుత్వ కొలువుకు ఎంపికయ్యాడు. అలాగే నవ్యశ్రీ 86.61 మార్కులతో 45వ ర్యాంకు సాధించి ఎస్జీటీ పోస్టు సాధించారు. మండలంలోని కేశాపురం గ్రామానికి చెందిన ఉడుముల నరేశ్ ఫిజికల్ డైరెక్టర్ పోస్టుకు పరీక్షలు రాసి 88.5 మార్కులతో మూడో ర్యాంకు సాధించాడు. ఇరగంపల్లికి చెందిన అంకే భార్గవ 84.5 మార్కులతో పదో ర్యాంకు సాధించి, స్కూల్ అసిస్టెంట్ పీడీ పోస్టుకు ఎంపికయ్యాడు. తలమర్లకు చెందిన పి.సురేశ్ 78.78 మార్కులు సాధించి 16వర్యాంకుతో స్కూల్ అసిస్టెంట్ తెలుగు పోస్టు సాధించాడు. తలమర్లకు డి.వెంకట రమణమ్మ 82.80 మార్కులు సాధించి 137 ర్యాంకుతో ఈడబ్ల్యూసీ కోటా కింద ఎస్‌జీటీ పోస్టును సాధించారు.



మాధవి



ఉడుముల నరేశ్



అంకెభార్గవ



కిరణ్‌కుమార్



సురేశ్



నవ్యశ్రీ



వెంకటరత్నమ్మ

కానిస్టేబుల్.. ఇక టీచర్



పుట్లూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శ్రమ, పట్టుదలతో ఓ మహిళా కానిస్టేబుల్ తాను కలలుగన్న టీచర్ పోస్టును సాధించారు. పెద్దపప్పూరు మండలం జూటూరు గ్రామానికి చెందిన నాగరాజు, దేవి దంపతుల కుమార్తె వసుంధర డీఎస్సీ-2025లో 59వ ర్యాంకుతో ఎస్జీటీ పోస్టు సాధించారు. అనారోగ్యంతో తండ్రి మృతి చెందడంతో తల్లి పాడి ద్వారా కుటుంబాన్ని పోషించింది. తల్లి కష్టాన్ని గమనిస్తూ పెరిగిన వసుంధర ఆమె బాధ్యతలను పంచుకోవాలని భావించింది. ఈక్రమంలోనే ఆరేళ్ల కిందట పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి తల్లికి అండగా నిలిచింది. కానీ తాను చిన్నప్పటి నుంచి కలలు గన్న టీచర్ పోస్టుపై కోరికను ఆమె విడిచిపెట్టలేదు. ఒక వైపు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూనే లక్ష్యాన్ని ఛేదించడానికి అహర్నిశలు కృషి చేసింది. ఈక్రమంలోనే అనంతపురంలోని ఓ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుని మంచి ర్యాంకు సాధించి తన కలను నెరవేర్చుకుంది.

కణేకల్లులో...

కణేకల్లు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన చాకలి అశోక్ డీఎస్సీ-2025లో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో జిల్లాస్థాయిలో ఆరో ర్యాంక్ సాధించాడు. 2017లో ఈయన పోలీస్ శాఖలో చేరారు. ప్రస్తుతం స్పెషల్ డిపార్ట్‌మెంట్ విభాగంలో కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తున్నారు. అప్పటి నుంచి ఓవైపు విధులు నిర్వహిస్తూనే, డీఎస్సీకి ప్రిపేరయ్యారు. ఆమేరకు 86.5 మార్కులు సాధించి తన ఉపాధ్యాయ కలను నెరవేర్చుకున్నారు.



సోమందేపల్లిలో



సోమందేపల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న నరేష్ డీఎస్సీ-2025లో ఫిజిక్స్ స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు. 73.70 మార్కులతో 36వ ర్యాంకు సాధించి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈయన 2013లో కానిస్టేబుల్‌గా ఎంపికై పెనుకొండ, ముదిగుబ్బ, సోమందేపల్లిలో పనిచేశాడు. బీఈడీ పూర్తిచేసి టీచర్ వృత్తిలో రాణించాలన్న ఆకాంక్షతో గతంలో రెండుసార్లు డీఎస్సీ పరీక్షలు రాసినా అదృష్టం వరించలేదు. అయితే పట్టువీడక ప్రయత్నించడంతో చిరకాల స్వప్నం నెరవేరింది.

వెల్ఫేర్ అసిస్టెంట్‌కు నాలుగో ర్యాంక్

గోరంట్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపల్లి సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చంద్రకళకు డీఎస్సీ-2025లో నాలుగో ర్యాంకు లభించింది. అమడగూరు మండలంలోని కందుకూరిపల్లికి చెందిన చంద్రకళ ఫిజిక్స్ అసిస్టెంట్ పోస్టు కోసం పరీక్షలు రాసింది. ఈమెకు డీఎస్సీలో 82.53 మార్కులు వచ్చాయి. ఈమె భర్త గిరి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.



ఎస్జీటీ పోస్టుల్లో జిల్లా టాపర్లు వీరే

పేరు	ర్యాంకు	మార్కులు
చింతా దివ్యశ్రీ	మొదటి ర్యాంకు	92.79
ఉక్కుసల సాయికుమార్	రెండోర్యాంకు	92.70
గంజి రాశి	మూడోర్యాంకు	92.46

స్కూల్ అసిస్టెంట్ టాపర్లు వీరే

సబ్జెక్టు	పేరు	ర్యాంకు	మార్కులు
ఇంగ్లిష్	టి. మాధవి	మొదటిర్యాంకు	86.48
ఇంగ్లిష్	బండి ఉదయ్‌బాస్కర్	రెండోర్యాంకు	85.89
ఇంగ్లిష్	అలివిగొండ సిద్దార్థ	మూడోర్యాంకు	84.99
హిందీ	పవన్‌నారాయణకౌసిక్	మొదటిర్యాంకు	84.03
హిందీ	సిద్దవటం వరలక్ష్మి	రెండోర్యాంకు	82.68
హిందీ	గుజ్జల అమృతవాణి	మూడోర్యాంకు	79.52
తెలుగు	గవ్వల బాలచంద్ర	మొదటిర్యాంకు	84.92
తెలుగు	గంధం అశోక్‌కుమార్	రెండోర్యాంకు	83.88
తెలుగు	ఎన్.వెంకటరమణమ్మ	మూడోర్యాంకు	83.87
బయాలజీ	గౌనీ మధు	మొదటిర్యాంకు	88.52
బయాలజీ	వంగలపల్లిదేవరాజ్	రెండోర్యాంకు	87.32
బయాలజీ	దేవరపల్లి రాజ్‌కుమార్	మూడోర్యాంకు	84.06
ఫిజికల్‌సైన్స్	తలారి సురేష్	మొదటిర్యాంకు	87.95
ఫిజికల్‌సైన్స్	కట్టా సురేష్‌బాబు	రెండోర్యాంకు	83.25
ఫిజికల్‌సైన్స్	కె. వాసుదేవరావు వేదవ్యాస్	మూడోర్యాంకు	83.23
గణితం	పోర్నాల మంజుల	మొదటిర్యాంకు	87.89
గణితం	ఇ.చంద్రమౌళి	రెండోర్యాంకు	86.46
గణితం	పసుపులేటి లక్ష్మీదేవి	మూడోర్యాంకు	84.19
సోషియల్	పలమాసి అమరేష్	మొదటిర్యాంకు	88.89
సోషియల్	సపరే వెంకటేశులు	రెండోర్యాంకు	85.58
సోషియల్	కులగుంట్ల జ్యోతి	మూడోర్యాంకు	84.58
ఫిజికల్ డైరెక్టర్లు			
భజంత్రీ ఉమామహేష్		మొదటిర్యాంకు	92.05
కాలమ్మగారి సురేష్‌బాబు		రెండోర్యాంకు	92.00
ఉడమాల నరేష్		మూడోర్యాంకు	88.00
ఉర్దూ సోషియల్			
షేక్‌సల్మా		మొదటిర్యాంకు	55.08
షేక్ రష్మిత్		రెండోర్యాంకు	54.00
పి.హుషేన్‌బాషా		మూడోర్యాంకు	52.00

ఉర్దూలో మొదటి ర్యాంక్

కదిరి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఎస్జీటీ (ఉర్దూ)లో తలుపుల మండలానికి చెందిన పఠాన్ టోపీ వలికి మొదటి ర్యాంక్ సాధించాడు. ఈయన డీఎస్సీలో 74.97 మార్కులు సాధించాడు. టోపీ వలీ తండ్రి సాధారణ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కుమారుడు ప్రభుత్వ ఉద్యోగం సాధించడంతో ఆయన సంతోషంతో ఉప్పొంగిపోయాడు.





వెరిఫికేషన్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ ప్రసాద్‌బాబు

నిబంధనల మేరకే వెరిఫికేషన్

డీఎస్సీ కమిటీలతో డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 ద్వారా ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన నిబంధనల మేరకే చేపట్టాలని డీఈఓ ప్రసాద్‌బాబు కమిటీలకు సూచించారు. పీవీకేకే ఎంబీఏ కళాశాలలో వెరిఫికేషన్ కమిటీలతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ నియామకాల్లో వెరిఫికేషన్ ప్రక్రియ అత్యంత కీలకమైనదన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇచ్చిన మార్గదర్శకాలను విధిగా పాటించాలన్నారు. సోమవారం నుంచి వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతుందని, ప్రతిఒక్కరు సమయపాలన, నిబంధనలు పాటించాలన్నారు. పరిశీలన అనంతరం ఎక్కడైనా లోటుపాటు బయటపడితే అందుకు మీదే బాధ్యత అని హెచ్చరించారు. సమావేశంలో డైట్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఏడీ మునీర్, డిప్యూటీ డీఈఓలు మల్లారెడ్డి, శ్రీనివాసరావు, ఏఎస్ఓ శ్రీనివాసులు, ఏపీఓ మంజునాథ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

బుక్కరాయసముద్రం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలంపల్లి గ్రామంలో కడుపునొప్పి తాళలేక అమృత(23) శనివారం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ గణేశ్‌కు నాలుగేళ్ల కిందట అమృతతో వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల ఒక కుమారుడు ఉన్నాడు. గత కొంత కాలం నుంచి అమృత కడుపు నొప్పితో బాధపడుతుండేది. పలు చోట్ల చికిత్స చేయించినా కడుపు నొప్పి తగ్గలేదు. దీంతో నొప్పి భరించలేక శనివారం ఇంట్లోనే ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుంది. ఈ సంఘటనపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని మహిళ..

నార్పల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందలవాడ గ్రామంలో మతిస్థిమితం లేని సాకే రాజమ్మ(44)ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన కాటమయ్య భార్య సాకే రాజమ్మ రెండేళ్ల నుంచి మతిస్థిమితం లేకుండా ఉండేది. ఈక్రమంలోనే శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబికులు పలుచోట్ల వెతికినా ఆమె జాడ తెలియలేదు. అయితే గ్రామ సమీపంలోని ఒక తోటలో ఉరి వేసుకుని సాకే రాజమ్మ మృతి చెందిందని స్థానికులు శనివారం కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో వారు వెళ్లి ఉరికి వేలాడుతున్న రాజమ్మ మృతదేహాన్ని కిందకు దించారు. మృతురాలికి కొడుకు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాగర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గర్భిణి రాధిక మృతదేహానికి పోస్టుమార్టం

బుక్కరాయసముద్రం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అబార్షన్ సమయంలో వైద్యం వికటించి మృతి చెందిన రాధిక మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించారు. ఈ నెల మూడో తేదీ అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మండలంలోని చెదల్ల గ్రామానికి చెందిన ఐదు నెలల గర్భిణి మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటనపై బాధితులు ఎవరికీ ఎటువంటి ఫిర్యాదు చేయలేదు. అయితే డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీదేవీ అనంతపురం మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిబంధనలు ఉల్లఘించి అబార్షన్ చేసి ప్రాణాలు తీశారని, ఆస్పత్రిలో సరైన సౌకర్యాలు లేవని పలు అంశాలపై ఆమె ఫిర్యాదు చేశారు. దీంతో అనంతపురం మూడో పట్టణ పోలీసుస్టేషన్ సీఐ క్రాంతిలాల్, బుక్కరాయసముద్రం సీఐ పుల్లన్న, తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, వైద్యకళాశాల ప్రొఫెసర్ చెదల్లకు వెళ్లి సమాధిని తవ్వించి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

ఏసీబీ కేసులో ఆర్టికల్ ఆఫ్ చార్జ్

అనంతపురం అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఏసీబీ కేసులో ఉన్న వ్యవసాయ అధికారి వెంకటేశ్వరప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ గిరిబాబుకు ప్రభుత్వం ఆర్టికల్ ఆఫ్ చార్జ్‌ను జారీ చేసింది. 2023 ఆగస్టులో రాప్తాడు రెగ్యులర్, కూడేరు ఇన్‌చార్జి ఏఓగా పనిచేసిన వెంకటేశ్వరప్రసాద్, అనంతపురం ఏడీఏ ఆఫీస్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గిరిబాబును ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఓ డీలర్ నుంచి డబ్బులు డిమాండ్ చేసిన నేపథ్యంలో అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ప్రస్తుతం ఏసీబీ కోర్టులో ఈ కేసు నడుస్తోంది. ప్రస్తుతం ఏఓ వెంకటేశ్వరప్రసాద్ శ్రీసత్యసాయి జిల్లాలో, జూనియర్ అసిస్టెంట్ అనంతపురం జిల్లాలో పనిచేస్తున్నారు. వీరిద్దరి వివరణ అనంతరం శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

28న వాకిన్ ఇంటర్వ్యూలు

అనంతపురం రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఎంబీఏ విభాగంలో ఖాళీగా ఉన్న అకడమిక్ కన్సల్టెంట్ల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు శనివారం తెలిపారు. ఈ నెల 28వ తేదీ ఉదయం 10గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. ఎంబీఏ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. ఎంబీఏలో 55శాతం మార్కులు తప్పనిసరిగా వచ్చి ఉండాలని అన్నారు. ఆసక్తి గలవారు తమ సర్టిఫికెట్లతో పాటు రెండు పరిశోధన పత్రాలను తీసుకురావాలని సూచించారు.

డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

అనంతపురం విద్య, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఎస్సీ యువతకు హెవీ మోటారు వాహనాల డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తామని ఎస్సీ కార్పొరేషన్ సంచాలకులు మహీధర్ శనివారం తెలిపారు. కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలో శిక్షణకు పది మందిని ఎంపిక చేస్తామని తెలిపారు. ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలకు శిక్షణకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఎంపికైన వారికి జిల్లా ఆర్టీసీ డిపో మేనేజరు ఆధ్వర్యంలో మోటారు డ్రైవింగ్ నేర్పిస్తారని తెలిపారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

అనంతపురం క్రైం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 25వ తేదీన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహిస్తామని ఎస్పీ జగదీష్ శనివారం తెలిపారు. సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన పురుష, మహిళా అభ్యర్థులు సోమవారం ఉదయం 8 గంటలకు అనంతపురంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగే వెరిఫికేషన్‌కు హాజరుకావాలని సూచించారు. సివిల్ విభాగంలో ఎంపికైన 278 మంది, ఏపీఎస్పీ విభాగంలో ఎంపికైన 210 మంది అభ్యర్థులకు వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు. అభ్యర్థులంతా అప్లికేషన్‌తో జత చేసిన అన్ని ధ్రువీకరణ పత్రాల ఒరిజినల్ సర్టిఫికెట్లు, గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించిన మూడు సెట్ల జిరాక్స్ కాపీలు, నాలుగు కలర్ పాసుపోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

టీడీపీ పరిశీలకుల నియామకం

అనంతపురం క్రైం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జిల్లాకు ముగ్గురు పార్లమెంట్ కమిటీ పరిశీలకులను నియమించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గానికి పరిశీలకులుగా అమర్నాథ్ రెడ్డి, డోలా బాల వీరాంజినేయస్వామి, మద్దిపట్ల సూర్యప్రకాష్‌ను నియమించారు. పార్లమెంట్ కమిటీల ఏర్పాటు ప్రతిపాదనల సేకరణ కోసం ఈ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ నెల 26న ఇతర పార్లమెంట్ నియోజకవర్గ కమిటీ సమావేశాలతోపాటు, అనంతపురంకమిటీ సమావేశం నిర్వహిస్తారు.

చీనీ టన్ను రూ.18వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 18వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.9వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 890 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

శ్రావణం.. పరిసమాప్తం

అంజన్నకు విశేష పూజలు



నెట్టికంటి, మురడి, నేమకల్లు ఆలయాల్లో ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ

గుంతకల్లు, డి.హీరేహాళ్, బొమ్మనహాళ్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శ్రావణ మాసోత్సవాలు శనివారంతో ముగిశాయి. కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో అమావస్య, మాస ఐదో శనివారం సందర్భంగా పూజా కార్యక్రమాలను విశేషంగా నిర్వహించారు. రాత్రి ఒంటె వాహనంపై సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వామివారు ఊరేగించారు. ఈఓ విజయ రాజు, ధర్మకర్త సుగుణమ్మ, ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, సూపరింటెండెంటువెంకటేశ్వర్లు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. మురడి ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి కుంకుమార్చన, బిల్వార్చన, సహస్రనామార్చన నిర్వహించారు. ఆఖరి శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పెద్దమడి ఆనందరెడ్డి, దేవరెడ్డిపల్లి హనుమంతరెడ్డి కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తన సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. నేమకల్లు ఆంజనేయస్వామికి విశేష పూజలు జరిగాయి. స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ బందోబస్తును పర్యవేక్షించారు. ఎస్ఐ నబీరసూల్, ట్రైనీ ఎస్ఐ వినోద్, ఏఎస్ఐ హనుమంతరెడ్డి బందోబస్తులో పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు, మాజీ ధర్మకర్తలు కాశీనాథ్‌శెట్టి, శాంతయ్య, టీడీపీ నాయకుడు గాలి బసప్ప పాల్గొన్నారు.

అనుచితంగా ప్రవర్తించి.. హతమయ్యాడు

ధనుంజయ హత్య కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

ధర్మవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తన భార్యతో అనుచితంగా ప్రవర్తిస్తున్నందుకే మెకానిక్ ధనుంజయను వరుసకు సోదరుడైన శివయ్య హత్య చేశాడని పోలీసులు గుర్తించారు. పట్టణంలోని ఎల్‌పీ సర్కిల్‌లో ఈ నెల 21వ తేదీ రాత్రి జరిగిన మెకానిక్ పాళ్యం ధనుంజయ హత్య జరిగింది. ఈ కేసులో నిందితుడు శివయ్యను అరెస్టు చేశామని డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో శనివారం రాత్రి విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు తెలిపారు. కేతిరెడ్డి కాలనీ ఎల్-2లో పాళ్యం శివయ్య, ఎల్-3లో అతని పిన్ని కుమారుడు పాళ్యం ధనుంజయ నివాసం ఉంటున్నారు. వీరిద్దరూ స్నేహంగా ఉంటూ మద్యం సేవించేవారు. శివయ్య భార్యతో ధనుంజయ చెడుగా ప్రవర్తించేవాడు. దీంతో శివయ్య మందలించాడు. అయినా అతనిలో మార్పురాలేదు. దీంతో శివయ్య కక్ష పెంచుకుని పథకం ప్రకారం ఈ నెల 21వతేదీ అర్ధరాత్రి ఎల్‌పీ సర్కిల్‌లో బ్రిడ్జి కింద ధనుంజయను సిమెంట్ ఇటుకతో బాది చంపేశాడు. నిందితుడిని సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్ఐ కేతన్న, హెడ్ కానిస్టేబుళ్లు అప్పస్వామి, శివశంకర్, కానిస్టేబుళ్లు రాజప్ప, షాకీర్, బయన్న, సుధీర్‌కుమార్, రాజన్న శనివారం అరెస్టు చేశారని డీఎస్పీ తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

ధర్మవరం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ధర్మవరం పట్టణ, పరిసర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసినట్టు ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో శనివారం ఆయన అరెస్టుకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించారు. పట్టణంలోని కేతిరెడ్డికాలనీకి చెందిన పాల్తూరి రామకృష్ణ అలియాస్ బాలరామకృష్ణన్ ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రం వేలూరులో నివాసముంటున్నాడు. మరో నిందితుడు భగవంతప్ప రామాంజినప్ప కర్ణాటక రాష్ట్రం పావగడ తాలూకా పన్నసముద్రం పంచాయతీ అచ్చంపల్లి గ్రామంలో ఉంటున్నారు. వీరిద్దరు ధర్మవరం పట్టణ, పరిసర ప్రాంతాలలో పగటిపూట రెక్కీ నిర్వహిస్తూ రాత్రిపూట ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నారు. అలాగే చైన్ స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. ఆయా ఘటనలపై వచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి వారిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.9లక్షల బంగారం అభరణాలు, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై ధర్మవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రెండు , టూటౌన్ పరిధిలో ఒకటి, పావగడ పోలీసు స్టేషన్‌లో రెండు కేసులు ఉన్నాయన్నారు. వీరిద్దరూ ఇదివరకే చోరీ కేసుల్లో కోయంబత్తూరు, అనంతపురం జిల్లాలోని జైళ్లలో శిక్ష అనుభవించారన్నారు. రామాంజి నప్ప కర్ణాటక రాష్ట్రంలో కూడా పలు ఇళ్లలో చోరీలు చేసి అభరణాలను బెంగళూరులో విక్రయించాడని వివరించారు. సమావేశంలో వన్‌టౌన్, టూటౌన్ సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప, హెడ్‌కానిస్టేబుల్ అప్పస్వామి, కానిస్టేబుళ్లు రాజప్ప, షాకీర్‌లు పాల్గొన్నారు.

నియోజకవర్గానికో రైతు బజార్

మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ రామాంజనేయులు

అనంతపురంరూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గానికో రైతు బజార్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ రామాంజనేయులు వెల్లడించారు. ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీలు రాఘవేంద్రకుమార్, నరసింహామూర్తిలతో కలిసి శనివారం ఆయన మార్కెట్ కమిటీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని మార్కెట్ కమిటీ కార్యదర్శులతో మార్కెట్ ఫీజు వసూళ్లపై చర్చించారు. తర్వాత ఆయన మాట్లాడుతూ..రైతు బజారుకు నిర్మాణం కోసం అర ఎకరా నుంచి ఒక ఎకర స్థలం కావాల్సి ఉందన్నారు. ఆ మేరకు క్షేత్రస్థాయిలో ప్రభుత్వ భూముల సేకరణకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. స్థలాలు లభ్యమైతే రూ.50 లక్షల నుంచి రూ. కోటివరకు నిధులతో రైతు బజారు ఏర్పాటు చేస్తామన్నారు. మార్కెట్ యార్డులలో ఉద్యాన, వ్యవసాయేతర షెడ్లు, కోల్డ్ స్టోరేజీలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రీజియన్‌లో 74 మార్కెట్ కమిటీలుండగా 50కమిటీల్లో పాలకవర్గం ఏర్పాటైనట్లు తెలిపారు.

ఆశాజనకంగా వసూళ్లు

ఈ ఆర్థిక సంవత్సరం మార్కెట్ కమిటీల ఫీజు వసూళ్లు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. రీజియన్‌లోని ఎనిమిది జిల్లాలో 145.35కోట్ల ఫీజు వసూళ్ల లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నాలుగు నెలల్లో రూ.39.54కోట్లు వసూలైనట్లు వెల్లడించారు. నాలుగు నెలల్లో అనంతపురం రూ.13.49కోట్లకు గాను రూ.3.95కోట్లు, చిత్తూరు రూ 10.39కోట్లకు..3.85కోట్లు, కడప రూ.13.53కోట్లకు 3.61కోట్లు, కర్నూలు రూ.40.40కోట్లకు రూ.7.35కోట్లు, నంద్యాల రూ.26.66కోట్లకు..రూ.8.18కోట్లు, తిరుపతి రూ.25.91కోట్లకు..రూ.7.24కోట్లు, అన్నమయ్య రూ.9.15కోట్లకు..3.91కోట్లు, శ్రీ సత్యసాయి రూ.5.82కోట్లకు రూ.1.42కోట్ల మార్కెట్ ఫీజు వసూలైనట్లు తెలిపారు.

గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయండి

జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గణేష్ చతుర్థి ఉత్సవాలను సంబంధిత శాఖాధికారులు, ఉత్సవకమిటీ సభ్యులు సమన్వయంతో విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ అన్నారు. కలెక్టరేట్‌లో గణేశ ఉత్సవ సమితి, సంబంధిత అధికారులతో శనివారం ఆయన గణేశ చతుర్థి ఉత్సవ నిర్వహణ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి 31 వరకు జరిగే ఉత్సవాలను ఎటువంటి ఇబ్బంది లేకుండా నిర్వహించాలన్నారు. ఉత్సవ నిర్వాహకులు పోలీసు, ఫైర్, మున్సిపల్, పంచాయతీ విభాగాలతో అనుమతి తీసుకోవాలన్నారు. పర్యావరణహిత మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలని సూచించారు. రాత్రి 10గంటల తరువాత లౌడ్‌స్పీకర్లు పెట్టరాదన్నారు. గుత్తి రోడ్డులోని హెచ్చెల్సీకి నీటిని విడుదల చేస్తే... విగ్రహాల నిమజ్జనానికి అనుకూలంగా ఉంటుందని నిర్వాహకులు జేసీకి విన్నవించారు. ఈ అంశంపై పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆయన ఎస్ఈని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్ఓ మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, డీఎస్పీ శ్రీనివాసరావు, ట్రైనీ డీఎస్పీ అష్రఫ్‌అలీ, అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్‌రావు, ఎక్సైజ్ అధికారి రామ్‌మోహన్‌రెడ్డి, పీసీబీ ఈఈ పీవీ కిషోర్, డీఈఓ ప్రసాద్ బాబు, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం: కలెక్టర్

పుట్లూరు, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): వర్షాకాల నేపథ్యంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కడవకల్లు గ్రామంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవన్నారు. గ్రామాల్లో ఎక్కువగా ఇంకుడు గుంతలు తవ్వుకుంటే వర్షపునీరు భూగర్భజలంగా వృద్ధి చెందుతుందన్నారు. జిల్లాలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. కడవకల్లు ఎస్సీకాలనీలో నీరు నిల్వ ఉండకుండా వెళ్లేలా మ్యాజిక్ డ్రైన్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంతకుముందు గ్రామంలో పర్యటించి లబ్ధిదారులు లక్ష్మీదేవి, భూలక్ష్మి ఇళ్ల వద్ద ఉపాధిహామి పథకం కింద చేపట్టిన వ్యక్తిగత సోక్‌పిట్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. పలురకాల మొక్కలను నాటారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలించారు. పాఠశాల మైదానం కోసం అవసరమైన స్థలాన్ని గ్రామంలో గుర్తించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ శేషారెడ్డిని ఆదేశించారు. కార్యక్రమంలో డీపీఓ నాగరాజునాయుడు, జడ్పీ సీఈఓ రామసుబ్బయ్య, డ్వామా పీడీ సలీంబాషా, ఏపీడీ పుల్లారెడ్డి, ఏపీఓ తులసీప్రసాద్, ఈఓఆర్డీ శివప్రసాద్, సర్పంచు రామాంజనేయులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి ఫెన్సింగ్ సెలెక్షన్స్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా అండర్-17 ఫెన్సింగ్ క్రీడాకారుల సెలెక్షన్‌లు ఈ నెల 25వతేదీన అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తామని జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీ కృష్ణ, కార్యదర్శి పుష్పావతి తెలిపారు. అండర్-17 బాల, బాలికల విభాగంలో ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. 2009 జనవరి 1 నుంచి 2012 డిసెంబరు 31వ తేదీ లోపు జన్మించిన క్రీడాకారులు అర్హులని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 30న పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడాసామగ్రితో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 9553768295లో సంప్రదించాలని కోరారు.

రేపు సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

ఉమ్మడి జిల్లా సీనియర్ మహిళా సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణుల ఎంపిక పోటీలు ఈనెల 25వ తేదీన ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తామని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గాయత్రి, గంగమ్మ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 30వ తేదీన గుంటూరు జిల్లా సత్తెనపల్లి లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ మహిళా సాఫ్ట్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు తమ జననధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడాసామగ్రి, యూనిఫాంతో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 7989017210లో సంప్రదించాలని కోరారు.

28న రాష్ట్రస్థాయి పారా బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు

పారా రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ జూనియర్, యూత్ పోటీలు ఈ నెల 28న అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో నిర్వహిస్తామని జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు తెలిపారు. ఆసక్తి, అర్హతగల పారా క్రీడాకారులు ఈ నెల 26వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలు జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9390388169, 8074106154లో సంప్రదించాలని కోరారు.

ఆరోగ్యంపై అవగాహనకు క్విజ్

అనంతపురం వైద్యం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, ఎయిడ్స్, సుఖవ్యాధులు, కౌమార ఆరోగ్యం, మాదక ద్రవ్యాలతో అనర్థాలపై విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన పోటీలకు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీడీ నియంత్రణ విభాగాధికారి డాక్టర్ అనుపమ జేమ్స్, డీవీఈఓ వెంకటరమణ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థుల్లో ఆరోగ్యం పట్ల అవగాహన పెంచేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని డాక్టర్ అనుప జేమ్స్ తెలిపారు. క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతిని ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు హేమంత్, చరణ్ తేజ, ద్వితీయ బహుమతిని తాడిపత్రి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు గౌసియా, సిద్దిబాషావలి, తృతీయ బహుమతిని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మౌనిక, ధరణి గెలుపొందారు. ఈ నెల 26న విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రథమ, ద్వితీయ బహుమతి పొందిన విద్యార్థులు వెళతారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గురుప్రసాద్, నోడల్ ఆఫీసర్ ఉషాకుమారి, ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ వెంకటరత్నం, సూపర్‌వైజర్లు రమణ, మురళీ, రిడ్స్ మేనేజర్ నరేష్‌బాబు, శివారెడ్డి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.34

అనంతపురంరూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శనివారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.34తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.20, సరాసరిధర రూ.27తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3,105 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చీపురు పట్టిన న్యాయాధికారులు



కోర్టులో గదిని శుభ్రం చేస్తున్న ఏడీజే

హిందూపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయాధికారి కంపెల్లె శైలజ, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వెంకటేశ్వర్లు నాయక్ శనివారం పాల్గొన్నారు. చీపురు చేతబట్టి న్యాయస్థానంలో శుభ్రం చేశారు. ప్రతి ఒక్కరూ తమ కార్యాలయాలు, ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు సూచించారు. దీనివల్ల దేశానికి సేవ చేసినవారమవుతామని అన్నారు. పరిశుభ్రత సమాజాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని అన్నారు.

అర్హులైన ప్రతి దివ్యాంగుడికి పింఛన్

- చైర్మన్ గడిపూటి నారాయణస్వామి



మాట్లాడుతున్న నారాయణస్వామి

అనంతపురం క్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన ప్రతి దివ్యాంగుడికి పింఛన్ అందుతుందని రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల కార్పొరేషన్ చైర్మన్ గడిపూటి నారాయణస్వామి పేర్కొన్నారు. స్థానిక ఆర్ అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో శనివారం ఆయన భిన్న ప్రతిభావంతుల జాతీయహక్కుల ఐక్యవేదిక, ఇతర నాయకులతో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. గత ప్రభుత్వంలో అనర్హులు చాలా మంది పింఛన్ల పేరుతో ప్రభుత్వ నిధులు స్వాహా చేశారన్నారు. వాటిని కూటమి ప్రభుత్వం రీ వెరిఫికేషన్ చేస్తోందన్నారు. ఏ ఒక్క దివ్యాంగుడికి పింఛన్ రద్దు కాదని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల జాతీయహక్కుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు వసంత కుమార్, జిల్లా కార్యదర్శి రామయ్య, కమిటీ నాయకులు రాజేష్, సింహ మోహన్, ఇతర నాయకులు మాబు, హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అనారోగ్యంతో గర్భిణి మృతి



హారిక (ఫైల్)

యాడికి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వీరన్నపల్లి గ్రామానికి చెందిన మూడునెలల గర్భిణి హారిక(22) అనారోగ్యం కారణంగా శనివారం మృతిచెందారు. హారిక, కేశవ దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఏడాది వయసున్న కూతురు కావ్య ఉంది. హారిక శుక్రవారం పాడి పశువులు కాయడానికి వెళ్లి వచ్చారు. రాత్రి కడుపునొప్పితో బాధపడ్డారు. వాంతులు, విరేచనాలు అయ్యాయి, ఫిట్స్ కూడా వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను యాడికి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అనంతరం తాడిపత్రికి, మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ హారిక మృతిచెందారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, ఆరోగ్యసిబ్బంది వీరన్నపల్లి గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించారు. అనారోగ్యంతోనే హారిక మృతిచెందినట్లు తెలిపారు.

కంటైనర్లను అడ్డుకున్న నాయకులు

పెనుకొండ రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కియ అనుబంధ పరిశ్రమ 'సంగు హైటెక్ కంపెనీ'లో పనులు తమకే కవాలని కొందరు నాయకులు కంటైనర్లను శనివారం అడ్డుకున్నారు. ఆ కంపెనీలో వైసీపీ నాయకులు కాంట్రాక్ట్ పనులు చేస్తున్నారు. ఆ పనులను రద్దుచేసి తమకు ఇవ్వాలని కోరుతూ శనివారం సాయంత్రం సంగు కంపెనీ నుంచి వస్తున్న కంటైనర్లను ఆపి, డ్రైవర్లను బెదిరించారు. విషయం తెలుసుకున్న కియ పోలీసులు అక్కడికి చేరుకునేలోగా వారు పరారయ్యారు. నాలుగు ద్విచక్రవాహనాల్లో ఐదుగురు వచ్చి బెదిరించారని డ్రైవర్లు తెలిపారు. ఈ విషయంపై కియ ఎస్ఐ రాజేష్‌ను వివరణ కోరగా, టీడీపీ నాయకులే పనుల కోసం ఇలా చేస్తున్నారని తెలిపారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

● జేసీ శివ నారాయణ శర్మ
● కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర నిర్వహణ



అధికారులతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని... వర్షాకాలంలో కలిగే అనారోగ్య సమస్యలు, జాగ్రత్తలపై తోటివారికి అవగాహన కల్పించాలని జేసీ శివ నారాయణ శర్మ సూచించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని అధికారులతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ పరిసరాల శుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ కొంత సమయాన్ని తప్పక కేటాయించాలన్నారు. తర్వాత అధికారులు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. డీఆర్‌ఓ మలోల, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బాలకొండయ్య, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, కలెక్టరేట్, ఖజానా శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

●అనంతపురం న్యూటౌన్: నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో గల పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ కార్యాలయం వద్ద స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఇందులో క్వాలిటీ కంట్రోల్ ఈఈ మల్లికార్జునమూర్తి, డీఈ లోకన్న చీపురుపట్టి పరిసరాలు పరిశుభ్రం చేశారు. క్యూసీ డీఈ లోకన్న, ఏఈలు ఓబులదాస్, సంగీత, పద్మావతి, సీనియర్ అసిస్టెంట్ మురళీకృష్ణ, చంద్రమౌళి, జూనియర్ అసిస్టెంట్ షేక్ రషీతో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

●అనంతపురం విద్య: స్థానిక జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర నిర్వహించారు. ఏడీలు మునీర్, శ్రీనివాసులు, ఇతర సెక్షన్ సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర సిబ్బంది పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. తర్వాత స్వచ్ఛతను కాపాడతామని ప్రతిజ్ఞ చేశారు.

●గార్లదిన్నె: మండలకేంద్రంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు కలిసి పంచాయతీ కార్యాలయం నుంచి గ్రామంలోని పురవీధులలో ర్యాలీ చేపట్టారు. అనంతరం గ్రామం మధ్యలో మానవ హారం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ యోగానందరెడ్డి, సర్పంచ్ సుబ్బమ్మ, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఏపీఓ ఓబన్న, ఆర్‌డబ్ల్యూఎస్ కోఆర్డినేటర్ అనూరాధ, ఐసీడీఎస్‌ఐ సూపర్‌వైజర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

●అనంతపురంరూరల్: మండలంలోని గ్రామాల్లో మండల అధికారులు, కూటమి నాయకులు స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కురుగుంటలో ఎంపీడీఓ దివాకర్, డిప్యూటీ ఎంపీడీఓ వెంకటనాయుడు హాజరై గ్రామ వీధుల్లో చెత్త తొలగింపు చర్యలు చేపట్టారు. అనంతరం గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించి, స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. పంచాయితీ, సచివాలయం అధికారులు, ఉద్యోగులు, గురుకుల పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

దుర్గాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణతో దుర్గాంజనేయస్వామి

శింగనమల, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): శింగనమల చెరువు కట్ట మీద వెలసిన దుర్గాంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. శ్రావణ మాసం కృష్ణ పక్షం అమావాస్య కావడంతో స్వామి మూలవిరాట్‌ను అర్చకులు 108 కిలోల తేనేతో అభిషేకించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు తగవు: టీడీపీ

రామగిరి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పరిటాల సునీతపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదని టీడీపీ నాయకులు మండిపడ్డారు. మండలకేంద్రంలో శనివారం సాయంత్రం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత రెండు మూడు రోజులుగా ఓ పత్రికలో ఎమ్మెల్యేపై పలు ఆరోపణలు చేస్తూ వస్తున్న కథనాలను ఖండించారు. వాస్తవాలు తెలుసుకోకుండా అన్ని విషయాలు ఎమ్మెల్యేకు ఆపాదించడం ఏమిటని ప్రశ్నించారు. గ్రామాల్లో అన్నదమ్ములు గొడవపడినా, దాయాదుల మధ్య ఆస్తి తగాదాలు ఉన్నా.. ఎక్కడ ఏమి జరిగినా అవన్నీ ఎమ్మెల్యే సునితమ్మే చేయించారంటూ ఆపాదించడం ఏమిటంటూ మండిపడ్డారు. తప్పుడు కథనాలు రాస్తే కబడ్దార్ అంటూ హెచ్చరించారు. కేవలం వైసీపీ వారి దౌర్జనాలు, ఆగడాలను మాత్రమే అడ్డుకుంటున్నారని తెలిపారు. వాస్తవాలు తెలుసుకుని మసులుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్, నాయకులు చిత్తరంజన్, ముత్యాలు, కట్టుబడి రామాంజనేయులు, హనుమంతు, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన రైతులకు మెరుగైన సేవలందించాలి

అనంతపురం అర్బన్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి) : ఉద్యాన రైతులకు మరింతగా మెరుగైన సేవలు అందించాలని ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఉమాదేవి ఆదేశించారు. నగరంలోని ఉద్యాన శాఖ జిల్లా కార్యాలయంలోని తన ఛాంబర్‌లో శనివారం ఆమె హెచ్‌ఓలు, ఎస్‌కే బనాన, ఇతర కంపెనీల ప్రతినిధులతో సమావేశమై మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో ఉద్యాన పంటల ఈ పంట నమోదును సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అరటి పంటలో ఫ్రూట్ కేర్ యాక్టివిటీ ద్వారా కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

నేడు శింగనమలకు ఎమ్మెల్యే రాక

శింగనమల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదివారం రానున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ కన్వీనర్ గుత్తా ఆదినారాయణ శనివారం ప్రకటనలో తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలోని క్రీడా మైదానంలో జరిగే స్త్రీశక్తి పథకం విజయోత్సవ సభలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే వస్తున్నట్లు చెప్పారు. టీడీపీ శ్రేణులు హాజరుకావాలన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ: ఎస్‌ఐ

గార్లదిన్నె, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని ఎస్‌ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపారు. మండలంలోని కల్లూరులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామాల్లో కొందరు ఆకతాయిల వ్యసనాలకు అలవాటు పడి ఈజీ మనీ కోసం దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. మరి కొందరు రోడ్డు ప్రమాదాలు చేసి తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇలాంటి వారిని గుర్తించేందుకు సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కల్లూరులో దాతల సహకారంతో 10 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి గ్రామంలోనూ సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు.

మున్సిపల్ ఆర్డీగా నాగరాజు బాధ్యతలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఆర్డీగా నాగరాజు స్థానిక మున్సిపల్ ఆర్‌డీ కార్యాలయంలో ఽశనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుమునుపు ఇక్కడ ఆర్‌డీగా పనిచేసిన విశ్వనాథ్ కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఇటీవల బదిలీ అయ్యారు. అక్కడ కమిషనర్‌గా పనిచేస్తున్న రవీంద్రబాబును ఇక్కడికి ఆర్‌డీగా బదిలీ చేశారు. అయితే పలు కారణాలతో రవీంద్రబాబు విధుల్లో చేరలేదు. దీంతో కొన్నాళ్లు విశ్వనాథ్‌నే ఇన్‌చార్జి ఆర్‌డీగా కొనసాగించారు. ఇప్పుడు తాజాగా సీడీఎంఏ కార్యాలయంలో పని చేస్తున్న నాగరాజును అనంతపురం మున్సిపల్ ఆర్‌డీగా బదిలీ చేశారు.

'ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి'

అనంతపురం రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని జేఎన్‌టీయూ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య నాగప్రసాద్ సూచించారు. జేఎన్‌టీయూ ఆవరణంలో శనివారం ఆయనతో పాటు కంట్రోలర్ ఆఫ్ ఎక్సామినేషన్ ఆచార్య శివకుమార్ తదితరులు ఎక్సామినేషన్ విభాగం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం నాగప్రసాద్ మాట్లాడుతూ..పర్యావరణ పరిరక్షణకోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. అడిషినల్ కంట్రోలర్స్ శేఖర్ రాజు, అంకారావు, శ్రీధర్, శివశంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీ మృతి

శింగనమల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని సలకంచెరువులోని ఓ వ్యవసాయపొలంలో కూలి పని చేస్తున్న లక్ష్మీదేవి(50) గుండెపోటుతో మృతి చెందారు. శింగనమల ఎస్సీ కాలనీకి చెందిన రామకృష్ణ భార్య లక్ష్మీదేవి వ్యవసాయ కూలీ పనులకు వెళుతుండేవారు. ఈ క్రమంలో శనివారం ఉదయం సలకంచెరువు గ్రామానికి వెళ్లి వేరుశనగ పొలంలో కలుపు తీస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలింది. తోటి కూలీలు వెంటనే శింగనమల ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గుండెపోటుతోనే మృతి చెందినట్లు చెప్పారు.

'ఆ హెచ్‌ఎం మాకొద్దు '

అనంతపురం విద్య, ఆగస్టు23 (ఆంధ్రజ్యోతి): శింగనమల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జున తమకు వద్దని, ఆయన ఉంటే తాము ఉద్యోగాలు చేయలేమని జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ అధికారుల వద్ద ఆ పాఠశాల టీచర్లు శనివారం మొరపెట్టుకున్నారు. ఆయన వద్దని రాతపూర్వకంగా ఫిర్యాదు ఉన్నారు. ఇటీవల బదిలీల్లో ఆయన శింగనమల పాఠశాలకు బదిలీ అయ్యారని, అయితే పాఠశాలకు సరిగా రారని, ఎప్పుడో ఒకసారి వచ్చి ఇంచార్జ్‌హెచ్‌ఎంతో ఇతరటీచర్లతో గొడవలు పెట్టుకుంటున్నారని వాపోయారు. మూడురోజులక్రితం ఇంచార్జ్‌హెచ్‌ఎం చంద్రకళ పట్ల అసభ్యంగా మాట్లాడారని అన్నారు. అందుకే ఇక ఆహెచ్‌ఎంను మేం భరించలేమని వాపోయారు. మొత్తంమీద చాలారోజులుగా అక్కడ జరుగుతున్న వివాదం చివరకు డీఈఓ ఆఫీస్‌కు చేరింది. ఇక్కడ ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాలి మరి.

చిన్న కదరయ్యస్వామి ఆలయంలో అన్నదానం

రాప్తాడు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరూరు గ్రామంలో గల చిన్నకదరయ్యస్వామి ఆలయం వద్ద సహకార సొసైటీ చైర్మన్ మరూరు గోపాల్, గోనుగుంట్ల లక్ష్మీదేవి దంపతులు శనివారం రాత్రి భక్తులకు అన్నదానం చేశారు. చిన్నకదరయ్యస్వామి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 600 మందికి పైగా భక్తులువచ్చారు. వారందరికీ గోపాల్ దంపతులు అన్నదానం చేశారు.


ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం

ఉద్యోగాలకు 27మంది ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు

అనంతపురంరూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గల పీవీకేకే డిగ్రీ , పీజీ కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 27మంది ఉద్యోగాలకు అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాఘవేంద్ర ప్రసాద్, ప్లేస్‌మెంట్ డీన్ భానుకిరణ్ తెలిపారు. సీఈఎట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పూల్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించగా.. బీఎస్సీ, బీసీఏ 2022-25వ బ్యాచ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఇంటర్వ్యూల తరువాత 27మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. వారికి వార్షిక వేతనంగా రూ.3లక్షలతోపాటు భోజనం, రవాణా సౌకర్యం సంస్థ కల్పించనుందని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ హెచ్ ఆర్ మేనేజర్ హరికృష్ణ, హెచ్‌ఆర్‌లు రాఘవన్, చంద్రన్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం: పీటీసీ ఏఎస్పీ


మాట్లాడుతున్న ఏఎస్పీ మల్లికార్జున వర్మ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, అలాగే శారీరక ధృడత్వం పెంపొందుతుందని పీటీసీ ఏఎస్పీ మల్లికార్జున వర్మ సూచించారు. ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 17వ గ్రామోత్సవ వాలీబాల్ క్రీడా పోటీలను స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఇషా ఫౌండేషన్ యువతను మేల్కొల్పేందుకు క్రీడాపోటీలను నిర్వహించడం శుభపరిణామమన్నారు. క్రీడలతో యువతకు శారీరక, మానసిక పదునుకు ఆజ్యం పోసినట్లేనని తెలిపారు. ఇషా ఫౌండేషన్ గ్రామోత్సవ క్రీడా పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి ఆకుల రాఘవేంద్ర మాట్లాడుతూ ఈ వాలీబాల్ పోటీలకు 22 జట్లు వచ్చాయని, ఫైనల్ విజేతలకు నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఐ ప్రతాప్‌రెడ్డి, ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ పద్మశ్రీ, పీడీ శ్రీరామ్, ఇషా ఫౌండేషన్ వలంటీర్లు ఆదిత్య, రవితేజ, హిమకర్, ప్రణీత్, ప్రియాంక, మాలతి, లాస్య, మణిరామ్, సర్వేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కోర్ కటింగ్ యంత్రం ప్రారంభం

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్ విభాగానికి కోర్‌కటింగ్ యంత్రం మంజూరైంది. క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌లో ఈఈ మల్లికార్జునమూర్తి, డీఈ లోకన్న శనివారం ఆ యంత్రాన్ని పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్వాలిటీ కంట్రోల్ విభాగానికి కోర్‌కట్టింగ్ యంత్రం చాలా ముఖ్యమన్నారు. యంత్రాన్ని జాగ్రత్తగా వినియోగించాలన్నారు. విశ్రాంతి డీఈ భరత్‌ప్రకాష్‌రెడ్డి, ఏఈ ఓబులదాస్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

మానవతా విలువలపై సదస్సు

అనంతపురంరూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి విద్యార్థులకు మానవతా విలువలు, వృత్తి నైతికతపై సదస్సును శనివారం నిర్వహించారు. మోటివేటిక్ క్రియేటర్ కృష్ణ, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. మానవ జీవితాన్ని సార్థకం చేసేది మానవతా విలువలన్నారు. వృత్తి జీవితాన్ని గౌరవప్రదంగా నిలబెట్టేది నైతికతని తెలిపారు. ఈ రెండు కలిసినప్పుడే సమాజంలో న్యాయం, శాంతి, అభివృద్ధి సిద్ధపడతాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌అండ్ డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి రాజేశ్వరి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐఎస్‌ఓ సర్టిఫికెట్ రావడం సంతోషకరం

● వైస్ చాన్సలర్ సుదర్శన్‌రావు

అనంతపురం రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తమ వర్సిటీకి ఆరు నాణ్యతా ప్రమాణాల సర్టిఫికెట్లు(ఐఎస్‌ఓ)రావడం సంతోషంగా ఉందని జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ సుదర్శన్‌రావు అన్నారు. వర్సిటీలో శనివారం ఐఎస్‌ఓ సర్టిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఐఎస్‌ఓ బృందం సభ్యులు వర్సిటీలోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పలు సూచనలు, సలహాలను అందజేశారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలను కాపాడుకోవాల్సిన అవసరం మన అందరిపై ఉందన్నారు. నాణ్యమైన ప్రమాణాలతో ఉన్నత విద్యలో మెరుగైన వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. హెచ్‌వైఎం ఇంటర్నేషన్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అలపాటి శివయ్య మాట్లాడుతూ విశ్వవిద్యాలయం నాణ్యత ప్రమాణాలను పాటిస్తోందని కితాబు ఇచ్చారు. అనంతరం వీసీ, రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణయ్య, ఏఓటీపీఆర్ఐ డైరెక్టర్ సుబ్బారెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, ఎంబీఏ విభాగాధిపతి చంద్రమోహన్‌రెడ్డి తదితరులుకు సర్టిఫికేషన్స్ పత్రాలను అందజేశారు.

స్త్రీశక్తి అమలుపై మహిళల హర్షం


చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు, టీడీపీ నాయకులు

అనంతపురంరూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం అమలుపై కురుగుంట పంచాయతీలోని మహిళలు హర్షం వ్యక్తం చేస్తూ శనివారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే పరిటాల సునీత చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు నారాయణస్వామి , పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డ్రాయింగ్‌లో ఎరా విద్యార్థుల ప్రతిభ

అనంతపురం రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొడిమి సమీపంలో గల ఎరా ఇంటర్నేషనల్లో విద్యార్థులు డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్ పోటీల్లో ప్రతిభచాటారు. గత నెలలో ఆదర్శ ఫైన్ ఆర్ట్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్ వారి ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారని, ఇందులో తమపాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్నారని పాఠశాల చైర్మన్ అరుణ్‌కుమార్‌రెడ్డి శనివారం తెలిపారు. అదేవిధంగా జాతీయ స్థాయి లలిత కళల పోటీల్లోనూ పతకాలు, సర్టిఫికేట్లు అందుకున్నారన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

అనంతపురం టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితిని పురస్కరించుకుని హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో శనివారం సాయంత్రం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా తొలుత ముత్యాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాదాపు 150 మందికి మట్టి విగ్రహాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు గురుశేఖర్ బాబు, బిందుప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల ఏర్పాట్లకు అన్ని శాఖలు సహకరించాలి

అనంతపురం టౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27 నుంచి ఐదు రోజులపాటు ఘనంగా జరుపుకోనున్న గణేశ ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు చేసుకుంటున్న నిర్వాహకులకు అన్ని శాఖలు సహకరించేలా చర్యలు చేపట్టాలని జిల్లా గణేశ ఉత్సవ సమితి నాయకులు కోరారు. ఈమేరకు శనివారం కలెక్టర్ వినోద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉత్సవ సమితి అధ్యక్షుడు విక్రమ్, ప్రధాన కార్యదర్శి విశ్వేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షురాలు గాజుల పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

రాప్తాడు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండమీదపల్లిలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ నిర్వహించనున్నట్లు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు శనివారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాల సునీత, ఎంపీ బీకే పార్థసారథి, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, దళిత సంఘాల నాయకులు హాజరవుతారన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.


అక్రమ మద్యం స్వాధీనం

అనంతపురం క్రైం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలుతున్న 144 మద్యం బాటిళ్లను నాలుగో పట్టణ పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. సీఐ జగదీష్, ఎస్‌ఐ ప్రసాద్‌కు సమాచారం రావడంతో కళ్యాణదుర్గం బైపాస్‌లో ఆటో స్టాండ్ వద్ద తనిఖీలు చేశారు. అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లి గ్రామ పంచాయతీలోని బీజేపీ కాలనీలో నివాసం ఉంటున్న షేక్ అస్లామ్‌బాషా(49) మద్యం దుకాణాల నుంచి తెచ్చుకున్న మద్యం బాటిళ్లతో ఆటో ఎక్కడానికి సిద్ధంగా ఉన్నాడు. ఈ క్రమంలో పోలీసులు నిఘా ఉంచి పట్టుకున్నారు. అతడి వద్ద రెండు బాక్సుల్లో షాట్ మిక్సీ 180 ఎంఎల్ బాటిళ్లు 96, మూడో బాక్సులో ఓల్డ్ అడ్మిరల్ బ్రాందీ 180ఎంఎల్ 48 బాటిళ్లు ఉన్నట్టు గుర్తించారు. వెంటనే వాటిని స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు. తర్వాత అతడిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసి జైలుకు పంపారు.

స్ఫూర్తి భారీ సభ పోస్టర్ల విడుదల

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సంచార-అర్ధ సంచార విముక్త జాతుల దినోత్సవం సందర్భంగా విజయవాడలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన స్ఫూర్తి భారీ సభ జరగనుందని, అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు కరపత్రాలను శనివారం ఆయన స్థానిక సంచార జాతులు, బుడబుక్కల వారితో తో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ఈశ్వర్, ఐటీ సెల్ కన్వీనర్ భీమా, యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, నాయకులు దామోదర్, అయ్యన్న, నరేష్‌కుమార్ సంజారజాతుల బుడబుక్కల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'మట్టి విగ్రహాలను పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం'


మాట్లాడుతున్న పీవీ కిశోర్ రెడ్డి

అనంతపురం టౌన్/ కలెక్టరేట్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వినాయక చతుర్థి సందర్భంగా మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ పీవీ కిశోర్ రెడ్డి పిలుపునిచ్చారు. పర్యావరణ అనుకూల వినాయక చవితి కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక మొదటిరోడ్డులోని శారద నగరపాలక బాలికల పాఠశాలలో విద్యార్థులచేత మట్టి వినాయక విగ్రహాల తయారీ పోటీలు నిర్వహించారు. పీవీ కిషోర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతిఒక్కరూ సహజసిద్ధమైన రంగులతో చేసిన మట్టి ప్రతిమలతో పర్యావరణ అనుకూల వినాయక చవితిని జరుపుకోవాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించకూడదని తెలిపారు. మట్టి విగ్రహాల తయారీ పోటీల్లో 6 నుంచి 10వ తరగతి వరకు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన వారికి ముఖ్యఅతిథి చేతులమీదుగా బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఐసీ శ్రీనివాస యాదవ్, ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, నేషనల్ గ్రీన్‌కవర్ సభ్యులు ఆనందభాస్కర్, కాలుష్యనియంత్రణ మండలి ఏఈ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు టంగుటూరి: జడ్పీ చైర్‌పర్సన్


ప్రకాశం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గిరిజమ్మ, జడ్పీ సిబ్బంది

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అందరికీ ఆదర్శప్రాయుడని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ కొనియాడారు. స్థానిక జెడ్పీ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా చైర్‌పర్సన్ గిరిజమ్మ హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. టంగుటూరి ప్రకాశం సైమన్ గో బ్యాక్ ఉద్యమంలో ఎనలేని ధైర్యసాహసాలు ప్రదర్శించారని గుర్తు చేసుకున్నారు. ఆయన బలమైన సంకల్పం కలిగిన వ్యక్తి అని, ఆదర్శప్రాయుడని కొనియాడారు. కార్యాలయ యూనిట్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన చేపట్టారు. కార్యక్రమంలో ఏఓ మల్లికార్జున సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు జూనియర్ అసిస్టెంట్ రామ్‌కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

●అనంతపురం రూరల్: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఎస్కేయూ కాలేజీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ విభాగంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు. రెక్టార్ ఆచార్య వెంకట్‌నాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు హాజరై ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ అంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అలాగే జేఎన్‌టీయూఏలో వీసీ సుదర్శన్‌రావు , రిజిస్ట్రార్ కృష్ణయ్య తదితరులు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు జయంతి వేడుకలు జరిపారు. ఓఎస్‌డీ ఆచార్య దేవన్న, డైరెక్టర్లు, హెచ్‌ఓడీలు, కంట్రోలర్లు, డీఆర్‌లు, ఏఆర్‌లు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు

●అనంతపురం టౌన్: టంగుటూరి ప్రకాశం జయంతిని స్థానిక రాయలసీమ సహకార శిక్షణా కేంద్రం ఆవరణలో బ్రాహ్మణ సేవాసంఘం సమాఖ్య నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సీవీ మురళీధర్, ప్రధాన కార్యదర్శి రామసుబ్బారావు, రాష్ట్ర నాయకులు ఏఎల్ఎన్ శాస్త్రి, న్యాయవాది హోసూరు రామసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ల తనిఖీ

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని పాత ఆర్డీఓ కార్యాలయం కాంపౌండ్ పక్కనున్న ఈవీఎం గోడౌన్లను కలెక్టర్ వినోద్‌కుమార్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోడౌన్ వద్ద భద్రతా చర్యలను, లాక్‌బుక్‌లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నెలవారి తనిఖీల్లో ఈవీఎంల గోడౌన్‌ను పరిశీలించామని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి, తహసీల్దార్ హరికుమార్, ఎన్నికల విభాగం డీటీ కనకరాజ్ పాల్గొన్నారు.

సురవరం మృతికి సీపీఎం నాయకుల నివాళి


సురవరం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అనంతపురం విద్య, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి మృతికి ఆ పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రెండు నిముషాల పాటు మౌనం పాటించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. వామపక్ష ఐక్యపోరాటాలను సమర్థవంతంగా నడిపిన మహాయోధుడు సురవరం అని కొనియాడారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. సీపీఐజిల్లా కార్యదర్శి నారాయణస్వామి, సీనియర్‌నాయకులు ఐదుకల్లు రవీంద్రనాథ్, మాలపాటివేణుగోపాల్, అజయ్‌కుమార్ , రాజారెడ్డి, చెన్నకేశవ,చియ్యేడుక్రిష్టా తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ఎరువుల మాఫియా: వైసీపీ

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో ఎరువుల మాఫియా విజృంభిస్తోందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎరువుల మాఫియా వెనుక టీడీపీ నేతల హస్తం ఉందని ఆరోపించారు. కేంద్రం నుంచి వచ్చిన యూరియా, డీఏపీ వంటి ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలివెళ్లాయన్నారు. యూరియా సరఫరాలో సీఎం చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు వెళ్లడం వలన బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. దీనిపై సీఎం, వ్యవసాయ మంత్రి ఎందుకు సమీక్ష జరపలేదని ప్రశ్నించారు.

ప్లాస్టిక్ నిషేధం అందరి బాధ్యత: ఏఎంసీ కమిషనర్


కాలుష్య రహిత ప్లేట్లను చూపుతున్న కమిషనర్ బాలస్వామి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిషేధం అందరి బాధ్యత అని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి సూచించారు. ప్లాస్టిక్ నిషేధంపై దుకాణాదారులతో శనివారం ఆయన నగరపాలక సంస్థ కౌన్సిల్‌హాల్‌లో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలలో ప్లాస్టిక్ నిషేధం పకడ్బందీగా అమలు చేస్తున్నారన్నారు. కాలుష్యనియంత్రణ మండలి నిబంధనల మేరకు విషపూరిత, హానికరమైన ప్లాస్టిక్ నిషేధం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. కలెక్టర్ ఆదేశాలతో నగరంలోని 56ప్లాస్టిక్ హోల్‌సేల్ దుకాణాలతో పాటు అన్ని షాపులలో తరచూ దాడులు నిర్వహిస్తామని, జరిమానాతో పాటు షాప్ సీజ్ చేస్తామని హెచ్చరించారు. అక్టోబరు 2 గాంధీజయంతి రోజు నాటికి ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఏఎంసీ ఈఈలు చంద్రశేఖర్, నరసింహులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

వైభవంగా పల్లకి సేవ



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం సాయంత్రం ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి, పల్లకీలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఉత్సవమూర్తులను ఆలయం చుట్టూ ఊరేగించారు. శ్రావణ మాసం చివరి శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో బొలికొండ రంగనాథస్వామి, అహోబిల నరసింహస్వామి

గుత్తిరూరల్,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేటలో వెలసిన నవ అహోబిల లక్ష్మీనరసింహ స్వామికి, తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం చివరి వారం సందర్భంగా స్వామి వారికి వేకువజామున పంచామృతాభిషేకం వివిధ పుష్పాలతో అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు చేతన్, మలోలా నరసింహ పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

బొమ్మనహాళ్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వంట గ్యాస్‌ను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని అనంతపురం డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో భారత్ గ్యాస్ సిలిండర్ల సరఫరాపై విచారణ చేశారు. రూ. 950 కి సిలిండర్ ఇస్తున్నారని లబ్ధిదారులు డీఎస్‌ఓ దృష్టికి తీసుకువచ్చారు. స్థానిక భారత్ గ్యాస్ బ్రాంచ్‌లో గ్యాస్ సిలిండర్లకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. రూ. 920కి ఇవ్వాల్సిన సిలిండర్‌ను అదనంగా రూ. 30 వసూలు చేస్తున్నట్లు విచారణలో తేలింది.

నెట్టికంటిని దర్శించుకున్న కాపు

గుంతకల్లుటౌన్,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన కాపు రామచంద్రారెడ్డి శనివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఆయన పేరట అర్చనలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు రామాంజనేయులు, హరిహరనాథ్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

వీహెచ్‌పీ కార్యవర్గం నియామకం

బొమ్మనహాళ్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): విశ్వహిందూ పరిషత్ బొమ్మనహాళ్ మండల అధ్యక్షుడిగా కొట్టాలపల్లి రమేష్‌ను నియమించారు. మండలంలోని ఉంతకల్లులో సమావేశం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు రాజేష్ ఆధ్వర్యంలో మండల కార్యవర్గాన్ని నియమించారు. మండల అధ్యక్షుడిగా రమేష్, ఉపాధ్యక్షులుగా భాస్కర్, రవీంద్రనాథ్, కార్యదర్శిగా పూజారి దివాకర్, సహకార్యదర్శిగా దాసరి వెంకటేశ్. కోశాధికారిగా మెట్టు గిరిజారెడ్డి, బజరంగదళ్ కన్వీనర్‌గా వీరేష్ ఆచారిని నియమించారు. కార్యక్రమంలో నాయకులు మద్దిలేటి సత్యనారాయణ, మల్లికార్జున, రామన్న పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

బెళుగుప్ప, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎరువుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ అనిల్ కుమార్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తహసీల్దార్ వ్యవసాయాధికారి పృథ్వీసాగర్, ఏఎస్‌ఐ రాందాసు ఆకస్మిక తనిఖీ చేశారు. ఫర్టిలైజర్ ఎరువుల దుకాణాల రికార్డులను పరిశీలించారు.

● శెట్టూరు : మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను శనివారం తహసీల్దార్ ఈశ్వరమ్మ, వ్యవసాయాధికారి వాసుకిరాణి తనిఖీ చేశారు. నానో యూరియా గురించి రైతులకు అవగాహన కల్పించి కొనుగోలు చేయించాలని తెలిపారు.

బీడీ కార్మికులకు ఇంటి స్థలాలివ్వాలి

తాడిపత్రి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికులకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించాలని పట్టణంలోని టైలర్స్‌కాలనీ సచివాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీడీ కార్మికులు మాట్లాడుతూ..20 సంవత్సరాలుగా బీడీ కార్మికుల వృత్తిలో పనిచేస్తున్నామని చట్టాలు వచ్చినా సౌకర్యాలు లభించలేదని వాపోయారు.

క్రమశిక్షణతో చదవాలి

తాడిపత్రి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలని తాడిపత్రి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌రెడ్డి తెలిపారు. స్థానిక తాడిపత్రి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. బీటెక్ చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, డైరెక్టర్ నటరాజేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ భానుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై వైసీపీ విష ప్రచారం

బెళుగుప్ప, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుండగా జీర్ణించుకోలేక వైసీపీ విష ప్రచారం చేస్తోందని టీడీపీ నాయకులు విమర్శించారు. శనివారం టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పెద్ద తిప్పయ్య, జిల్లా అభివృద్ధి కమిటీ సభ్యులు రాము, నాయకులు యర్రిస్వామి, వెంకటస్వామి, అనిల్, తిప్పేస్వామి విలేకరులతో మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులను అధిగమించి రాష్ట్ర సంక్షేమ, అభివృద్ధికి కృషి చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలన్నీ నెరవేరుస్తూ రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రత్యేక చొరవ చూపుతున్నారని అన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఇళ్ల మధ్యే మురుగు నీటి కుంటలు

● పొంచి ఉన్న రోగాలు
● పట్టించుకోని అధికారులు



దత్తాత్రేయ గుడి వద్ద ఇళ్ల మధ్య మురుగునీటి కుంట, బీసీ కాలనీలో మురుగునీటిలో కంపచెట్లు

పామిడి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఆవాసాల మధ్యనే మురుగు నీటి కుంటలు వెలిశాయి. విషపురుగులు, దోమలు, ఈగలకు ఇవి నివాసాలుగా మారాయి. ఈ పరిస్థితి ఏ మారుమూల కుగ్రామంలోనో కాదు.. వస్త్ర వ్యాపారానికి ప్రసిద్ధిగాంచిన పామిడి పట్టణంలో మురికి కూపాలు వెలుస్తున్నాయి. అసలే వర్షాకాలం కావడంతో ఈ కూపాలు చెరువులను తలపిస్తున్నాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెను ప్రమాదాలు పొంచి ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీ, దత్తాత్రేయ గుడి కాలనీ, బీసీ కాలనీ, టీచర్స్ కాలనీలలో ఇ ళ్ల మధ్యనే మురికి కూపాలు నెలకొన్నాయి. పంచాయతీ అధికారులు వీటిపై ఏ మాత్రం శ్రద్ధ వహించకపోవడంతో వీటి చుట్టూ కంపచెట్లు ఏపుగా పె రిగి విష పురుగులకు నెలవుగా మారాయి. సాయంత్రం వేళల్లో కాసేపు కూ డా ఆరుబయట కూర్చోలేని దుస్థితి దాపురించిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఆ మురుగు నీటి కుంటల్లో పందులు తిరగడంతో దుర్వాసన వెదజల్లుతోందని వాపోతున్నారు. దోమలు ఎక్కువగా ఉండడంతో అనారోగ్యాలకు గురవుతున్నామని స్థానికులు చెబుతున్నారు. అధికారులు పర్యటించినా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్న పాపానపోలేదని మండిపడుతున్నారు.

పంచాయతీలో నిధులు లేవు

నగర పంచాయతీ నుంచి గ్రామ పంచాయతీగా రూపాంతరం చెందిన తర్వాత నిధుల లేమి ఎక్కువగా ఉంది. పంచాయతీ పాలక వర్గం లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పంచాయతీకి నిధులు మంజూరు కావడం లేదు. పంచాయతీకి వస్తున్న నిధులతో అత్యవసర మౌలిక సదుపాయాలు, వసతులు కల్పిస్తున్నాం. ఆయా కాలనీలలో పర్యటించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటాం.

- అశ్వత్థమనాయుడు, డిప్యూటీ ఎంపీడీఓ, పామిడి

భయంగా బతుకుతున్నాం



ఎస్‌బీఐ కాలనీ సమస్యలకు చిరునామాగా మారింది. వైసీపీ ప్రభుత్వంలో ఎన్నికల ముందు సీసీ రోడ్లు నిర్మించి డ్రైనేజీలు నిర్మించకపోవడంతో ఇళ్ల మధ్యనే మురుగునీరు నిలుస్తోంది. చెరువులను తలపించేలా ఉండే ఈ నీటి కూపాలతో ఇబ్బందులు పడుతున్నాం. పగలే పాములు, తేళ్లు రోడ్లపైకి వస్తున్నాయి. ఏ విషపురుగు కాటుకు గురికావాల్సి వస్తుందోనని భయంగా బతుకుతున్నాం.

- సుధాకర్, ఎస్‌బీఐ కాలనీ, పామిడి

మురుగు నీరు పారలేదు



మండల కేంద్రమైనప్పటికీ కనీస మౌలిక వసతులు లేవు. కాలనీలలోని మురుగు ఎక్కడికి పారేది తెలియదు. ఇంటి పన్నులు మాత్రం విధించారు. సరైన రోడ్లు, డ్రైనేజీ పారేందుకు కాలువలు లేవు. రోడ్డు మధ్యలో తగ్గుగా పెట్టడంతో రోడ్డుపైనే నీరు నిలుస్తున్నాయి. పాములు ఇళ్లలోకి వస్తున్నాయి. వర్షం వస్తే రోడ్లపై నడిచేందుకు కూడా వీలుపడదు.

- సుంకన్న, బీసీ కాలనీ, పామిడి

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం : విప్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. రాయదుర్గం పట్టణంలోని సీతారామాంజనేయస్వామి ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలకు చట్టసభల్లో తగిన ప్రాధాన్యత ఉండాలని, ఆర్థిక స్వాతంత్ర్యం లభించాలని, పురుషులతో సమానంగా ఆస్తిహక్కు ఉన్నపుడే మహిళా సాధికారికత సాధ్యమవుతుందని బలంగా విశ్వసించిన మహానాయకుడు నందమూరి తారక రామారావు అని అన్నారు. మహిళా అభ్యుదయ కార్యక్రమాలను ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుకు తీసుకెళ్తూ ఆడపడుచుల ఆత్మాభిమానం పెంచుతున్నారని తెలిపారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించే దిశగా స్వయం సహాయ సంఘాలను ప్రారంభించారన్నారు. సభ్యుల అభిరుచులకు అనుగుణంగా వ్యాపారాలు చేసుకునేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తూ ఆర్థికంగా బలపడే విధంగా ప్రోత్సహిస్తూ వస్తున్నారన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఫింఛన్ ఒకేసారి వెయ్యి పెంచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. పేదల కోసం పాటుపడే ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. చంద్రబాబు నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్లేందుకు సహకారం అందించాలని కాలవ కోరారు.

సురవరం సుధాకర్‌రెడ్డి మృతికి ఘన నివాళి



యాడికిలో సురవరం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

యాడికి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సీపీఐ అగ్రనేత, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ఆ పార్టీ జిల్లా సమితి సభ్యుడు జూటూరు రఫీ తెలిపారు. శనివారం యాడికిలో సీపీఐ నాయకులు సురవరం సుధాకర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సమితి సభ్యుడు రఫీ మాట్లాడుతూ.. సురవరం మరణం కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మయ్య, రాముడు, రాఘవ, కుళ్లాయిరెడ్డి, రసూల్, రామయ్య, రంగస్వామి, వెంకటస్వామి పాల్గొన్నారు.

● రాయదుర్గంరూరల్ : ఎర్రజెండా ముద్దుబిడ్డ సురవరం సుధాకర్‌రెడ్డికి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగార్జున ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు తిప్పేస్వామి, నరసింహులు, దుర్గన్న, తేజ, పీరాసాబ్, మారన్న, నాగరాజు, తిప్పేస్వామి, మల్లికార్జున, మధు, బబ్లు పాల్గొన్నారు.

● కుందుర్పి : భారత కమ్యూనిస్టు పార్టీ కుందుర్పి మండల శ్రేణులు సురవరం సుధాకర్‌రెడ్డికి ఘన నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ గిరిజ మాట్లాడుతూ.. సురవరం మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో నాయకులు శామ్యూల్, మధు, నాగరాజు, బిసిలప్ప, ఈరన్న పాల్గొన్నారు.

సరిహద్దులో సినిమా షూటింగ్ సందడి



బొమ్మనహాళ్ సరిహద్దు అరటి తోటలో సన్నివేశాల షూటింగ్

బొమ్మనహాళ్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండల సరిహద్దులో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. శనివారం ఓ సినిమా షూటింగ్ భాగంగా చిత్ర బృందం కొన్ని సన్నివేశాలను చిత్రీకరించింది. ఫైట్ చిత్రీకరించారు. ఈ సినిమాలో హీరోగా జగదీష్, హీరోయిన్‌గా సహర నటిస్తున్నారు. పుష్ప సినిమాలో అల్లు అర్జున్‌కు తల్లి పాత్ర చేసిన కల్పలత పాల్గొన్నారు. అరటి తోటలో ఫైట్ సన్నివేశాలు చిత్రీకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ షూటింగ్ జరిగింది. నూతన నటీ నటులతో నిర్మిస్తున్నామని, ఇంకా పేరు పెట్టలేదని, మరి కొద్ది రోజులు అనంతపురం పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుగుతుందని సినిమా బృందం తెలిపింది.

ఇసుక డంప్ సీజ్

డీ.హీరేహాళ్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని హిర్దేహాళ్ గ్రామ సమీపంలో అక్రమంగా నిలువ చేసిన ఇసుక డంప్‌ను శనివారం పోలీసులు సీజ్ చేశారు. ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. హిర్దేహాళ్ గ్రామ సమీపంలోని ఎల్లమ్మ గుడి పరిసర ప్రాంతాలలో సుమారు ఆరు ట్రాక్టర్ల ఇసుక ఒకచోట డంప్ చేసి ఉం చారు. ఉదయం పూట ట్రాక్టర్ల ద్వారా ఒక చోట ఇసుకను డంపు చేసి రాత్రి సమయాలలో పక్కనే ఉన్న కర్ణాటక ప్రాంతానికి తరలించేందుకు ఈ ఇసుక డంపును ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి అక్కడికి వెళ్లి ఇసుకను సీజ్ చేశారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో ఆంజనేయస్వామి

బెళుగుప్ప, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తగ్గుపర్తిలో స్థానిక ఆంజనేయస్వామికి శ్రావణ మాసం చివరి శనివారం పూ జలు నిర్వహించారు. సామూహిక పంచామృతాభిషేకం, తులసీమాల అలంకరణ, గ్రామ పొలిమేరలో బలిదానం కార్యక్రమాలు చేపట్టారు.

●యల్లనూరు : శ్రావణమాసంలో ఆఖరి శనివారం కావడంతో ఉదయాన్నే ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వెంకట్రామయ్యస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

●రాయదుర్గంరూరల్ : మండలంలోని వడ్రవన్నూరు గ్రామ సమీపంలో వెలసిన అపులాపురం ఆంజనేయస్వామి దేవాలయంలో మల్లాపురం గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామికి శ్రావణమాసం చివరి శనివారం పల్లకి సేవ పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం మహామంగళహారతి తీర్థప్రసాదం గావించారు. స్వామిని దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఐసీడీఎస్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన పీడీ



కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ

కళ్యాణదుర్గం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కంబదూరు ఐసీడీఎస్ కార్యాలయాన్ని పీడీ నాగమణి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి గర్భిణీలు, చిన్నారులు, బాలింతలకు పంపిణీ చేస్తున్న పౌష్టికాహార వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహార కిట్ల పంపిణీ విషయంలో ఎవరైనా అవకతవకలకు పాల్పడితే శాఖ పరమైన చ ర్యలు తప్పవని హెచ్చరించారు. స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆమె ఐసీడీఎస్ కార్యాలయం ఆవరణంలో మొ క్కలు నాటి సిబ్బందితో కలిసి బేబీ ఫీడింగ్ సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం నాగమణి మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలో పలు చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహార కిట్లు సరిగా పం పిణీ కాలేదని గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ ఆదేశాలతో కంబదూరు ఐసీడీఎస్ కార్యాలయాన్ని తనిఖీ చేశానన్నారు. పీడీ వెంట సీడీపీవో పద్మావతి, సూపర్‌వైజర్లు, సిబ్బంది ఉన్నారు.

డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

రాయదుర్గం రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం డిగ్రీ ప్రవేశాలకు రిజిస్ట్రేషన్ ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 26వ తేదీ వరకు రిజిస్ట్రేషన్, 28వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ ప్రక్రియ ఉంటుందన్నారు.

అదుపుతప్పిన లారీ

కుందుర్పి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మలయనూరు గ్రామ సమీపాన శనివారం లారీ అదుపు తప్పి పొలాల్లోకి వెళ్లింది. విద్యుత్ స్తంభానికి కొద్ది దూరంలోనే డ్రైవర్ అదుపు చేయడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. కర్ణాటక చెళ్లకెర నుంచి ఖాళీగా కుందుర్పికి వస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

(న్యూస్ నెట్‌వర్క్-ఆంధ్రజ్యోతి)

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పలువురు అధికారులు పేర్కొన్నారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పలు చోట్ల స్వచ్ఛతా కార్యక్రమాలు, ర్యాలీలు, ప్రతిజ్ఞలు చేయించారు. గుత్తి పట్టణంలో మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మియా ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ సర్కిల్‌లో కమిషనర్ అధికారులు, ఉద్యోగులు ప్రతిజ్ఞ చేయించారు. కూడేరులో అన్ని శాఖ అధికారులు పాల్గొని ప్రధాన రహదారిపై విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. గుంతకల్లులో ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పామిడిలో డిప్యూటీ ఎంపీడీఓ అశ్వర్థమనాయుడు ఆధ్వర్యంలో ఎద్దులపల్లి రోడ్డు సర్కిల్ వరకూ పంచాయతీ అధికారులు, సచివాలయ ఉద్యోగులతో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఉరవకొండలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆదినారాయణ, వైస్ ప్రిన్సిపాల్ మస్తానప్ప పాల్గొన్నారు. మేజర్ పంచాయతీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో రవిప్రసాద్, కార్యదర్శి గౌస్, సర్పంచ్ లలితమ్మ పాల్గొన్నారు. యాడికిలో మొక్కల పెంపకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ వీరరాజు, డిప్యూటి ఎంపీడీఓ శశికళ, ప్రభుత్వ వైద్యుడు పరమేశ్వర్ పాల్గొన్నారు. బొమ్మనహాళ్ మండలం శ్రీధరఘట్టలో ఎంపీడీఓ విజయభాస్కర్, డిప్యూటి ఎంపీడీఓ దాస్, సర్పంచ్ యోగేశ్వరరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బలరాం రెడ్డి ప్రతి కుటుంబానికి రెండు చెత్తబుట్టల పంపిణీ చేశారు. కుందుర్పిలో తహసీల్దార్ ఓబుళేసు సి బ్బంది పరకపట్టి కార్యాలయ ఆవరణంలో శుభ్రపరిచారు. ఎంపీడీఓ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవో హరికృష్ణ అవగాహన కల్పించారు. బ్రహ్మసముద్రం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది పాల్గొని ఆవరణ మొత్తం శుభ్రం చేశారు



గుత్తిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

పెట్రోల్ బంక్‌కు స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

తాడిపత్రి, ఆగస్టు23(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంటపల్లి సమీపంలో రెవెన్యూ పెట్రోల్ బంక్ ఏర్పాటు కోసం శనివారం కలెక్టర్ వినోద్ కుమార్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనంతపురం తాడిపత్రి రహదారి పక్కన ఉన్న పెట్రోల్ బంక్‌కు అనువైన స్థలాలను సిద్ధం చేయాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ సోమశేఖర్‌ను ఆదేశించారు. హైవే పక్కన స్థలం అనుకూలంగా ఉంటుందని సూచించారు.

11 తులాల బంగారం నగలు చోరీ

కణేకల్లు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని యశోద అనే మహిళకు చెందిన 11 తులాల బంగారు నగలు చోరీ కాగా.. పోలీసుల అప్రమత్తతో అరగంటలోనే దొంగలను పట్టుకుని నగలను స్వాధీన పరుచుకున్నారు. వివరాల్లోకి వెళితే.. కణేకల్లుకు చెందిన నాగభూషణం భార్య యశోద రెండు రోజుల క్రితం కర్ణాటకలోని కుమార్తె ఇంటికి వెళ్లింది. శనివారం కళ్యాణదుర్గంలో బళ్లారి బస్సు ఎక్కింది. యశోద తన బ్యాగులో 11 తులాల బంగారు నగలను పెట్టుకుని కణేకల్లు క్రాసింగ్‌లో దిగింది. ఇద్దరు మహిళలు చాకచక్యంగా యశోద బ్యాగులోని నగలను కొట్టేశారు. బంగారు నగలు కనిపించకపోవడంతో భర్తకు ఫోన్‌లో విషయం తెలిపింది. ఆయన సమాచారం మేరకు వెంటనే అప్రమత్తమైన పోలీసులు వాహనంలో గోనేహాల్ వద్ద వెళుతున్న బస్సును ఆపి అందులోని మహిళలను పట్టుకుని బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయంపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఆలయ అభివృద్ధిపై ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న ఈఓ విజయరాజు

గుంతకల్లు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కసాపురం దేవస్థానంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ప్రభుత్వ అనుమతులు తీసుకురావాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు ఆలయ ఈఓ విజయరాజు వినతి పత్రాన్ని అందజేశారు. శనివారం ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం కార్యనిర్వాహణాధికారి విజయరాజుతో దేవస్థాన అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఆలయంలో చేపట్టాల్సి ఉన్న కలశ ప్రతిష్ఠ, ప్రాకార నిర్మాణం, వసతి గదుల నిర్మాణం, తదితర అంశాలపై ఎమ్మెల్యేకు ఈఓ వివరించారు. ప్రతిపాదనలు తయారు చేయించామని, ప్రభుత్వ అనుమతులు రావడానికి కృషిచేయాలంటూ ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుగుణమ్మ, ఏఈఓ వెంకటేశ్వరుడు, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, తలారి మస్తానప్ప, యుగంధర్, రామన్న చౌదరి, వీరేశ్, రాయల్ వెంకటేశులు పాల్గొన్నారు.

నూతన బార్‌కు దరఖాస్తు చేసుకోండి

రాయదుర్గంరూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో నూతన బార్‌కు ఈ నెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో బార్ పాలసీ నిర్వహణపై పట్టణ ప్రముఖులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం బార్‌పాలసీలో కొత్త విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. ఒక్కొక్క వ్యక్తి నాలుగు దరఖాస్తులు వేయవచ్చన్నారు. ఒక్కొక్క దరఖాస్తు విలువ రూ. 5 లక్షలుగా పరిగణించినట్లు తెలిపారు. బార్లు లైసెన్స్ పొందిన వారు 15 రోజులలో రెస్టారెంట్ ఏర్పాటుకు అనుమతి ఇస్తామన్నారు. పాలసీ ఫీజును వాయిదాలలో చెల్లించుటకు వెసులబాటు కల్పించినట్లు తెలిపారు. నూతన పార్కుకు నాలుగు దరఖాస్తులు రానియెడల అప్లికేషన్‌కు సంబంధించిన రుసుం తిరిగి ఇస్తామని తెలిపారు. 28వ తేదీన అనంతపురం జడ్పీ హాల్‌లో ఎంపిక ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు నూతన బార్‌కు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరిండెంట్ రామ్మోహన్ రెడ్డి, సీఐ మహేష్‌కుమార్, పట్టణవాసులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోనే ముస్లింలకు గుర్తింపు

పామిడి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలోనే ముస్లింలకు గుర్తింపు దక్కుతోందని గుత్తి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కొట్టం మాలిక్ బాషా పేర్కొన్నారు. స్థానిక తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వంలో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మండలంలోని ముస్లింలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. గుత్తి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్, సింగిల్ విండో డైరెక్టరు, ప్రభుత్వ చౌకధాన్యపు డిపో డీలర్లు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మెన్లుగా ఇలా ఎన్నో పదవులను ముస్లిం మైనార్టీలకు కేటాయించారన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరెడ్డి, సంజీవకుమార్, గౌస్‌పీరా, మహబూబ్ బాషా, రెహ్మాన్ పాల్గొన్నారు.

రిజర్వాయరులో నీటి నిల్వ 1.729 టీఎంసీలు

బెళుగుప్ప, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో 1.729 టీఎంసీల నీటి నిల్వ వున్నట్లు శనివారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో 2090 క్యూసెక్కులు వస్తుండగా ఔట్‌ఫ్లో కింద 2050 క్యూసెక్కులు వెళుతుందన్నారు. ఫేజ్-2 కింద 1452 క్యూసెక్కులు వెళుతుందని అధికారులు వెల్లడించారు.

చెరువులోకి గంబూషియా చేపలు

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుబేదార్ చెరువులోకి గంబూషియా చేపలను వదిలినట్లు సబ్ డివిజనల్ మలేరియా ఆఫీసర్ తిరుపాలయ్య తెలిపారు. శనివారం మున్సిపల్ కమిషనర్ వంశీ కృష్ణ భార్గవ్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఒక్కొక్క చెరువులోకి 4 వేల చొప్పున ఎనిమిది వేల చేపపిల్లలను వదిలినట్లు తెలిపారు. అనంతరం కుందుర్పి మండలంలో ఊరి బావిలో రెండు వేలు, బిస్తరపల్లి బారప్ప తోట సుజాతమ్మ బావిలో మూడు వేలు, బీకే ప్రభాకర్ తోట బావిలో మూడు వేలు, బెళుగుప్ప మండలంలో పలు చెరువులకు నాలుగు వేల చొప్పున చేపలను వదిలినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో ధర్మసింగ్, హెల్త్ అసిస్టెంట్ జాన్సన్, గంగరాజు పాల్గొన్నారు.